
ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర




వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 | సంచిక : 3 | నవంబర్ 2021

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి.పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


## ఈ సంచికలో....



నరక చతుర్దశి - దీపావళి .......................................... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 4


**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



గురువు ఏమిచేస్తాడంటే,
మీలో ఉన్న బలహీనతల
వల్ల వచ్చే నష్టం మీకు
అర్థమయ్యేలా చెప్పి,
మీ బుద్ధితో దానిని
పట్టించి, దానిని
పోగొట్టుకొనే శక్తి కూడా ఆయన ఇచ్చి మిమ్మల్ని
తరింపచేస్తాడో వాడు గురువు.

# నరక చతుర్దశి - దీపావళి

**నరకచతుర్దశి, దీపావళి పండుగ లోని అంతరార్థం శ్రీ నాన్నగారి మాటలలో . . . .**

దీపావళి గురించి రెండు కథలు చెపుతారు. నరకచతుర్దశి రోజున కృష్ణ భగవానుడు నరకాసురుడిని సంహరించాడు అని, ఆ రాక్షస సంహారము అయిన మరుసటి రోజున ప్రజలు దీపావళి చేసుకున్నారని, ఇలా ఒక కథచెపుతారు మన ప్రాంతంలో(దక్షిణాదిలో).

ఉత్తరప్రదేశ్‌లో ఇంకొక రకంగా చెపుతారు. రామచంద్ర మూర్తి పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేశాడు. అయోధ్యను విడిచిపెట్టి అరణ్యంలో వనవాసం, లంకలో రావణ సంహారంతో సహా, పధ్నాలుగు సంవత్సరాలు తరువాత దీపావళి రోజున రామచంద్ర మూర్తి అయోధ్యకు తిరిగి వచ్చాడు కాబట్టి, ఆరోజున అయోధ్యకు అంతా దీపాలు వెలిగించి బాణసంచా కాల్చారట. రాముడు అయోధ్య తిరిగి వచ్చాడని ప్రజలు ఆనందంతోటి కొత్తబట్టలు కట్టుకొని, పిండివంటలు చేసుకొని, దీపాలు వెలిగించి, దీపావళి పండుగ చేసుకొన్నారు.

దీపారాధన ఎందుకు చేస్తారు అంటే, దీపం జ్ఞానానికి గుర్తు. దీపం చీకటిని పోగొడుతుంది. జ్ఞానము అజ్ఞానాన్ని పోగొడుతుంది. అందుచేత పూజ చేసుకొన్నప్పుడు ముందు దీపం వెలిగిస్తారు. అదే దీపారాధన అంటే. పధ్నాలుగు సంవత్సరాల తరువాత రామచంద్ర మూర్తి వచ్చాడని అయోధ్య వాసులు అందరూ కూడా ఆ రోజు పెద్ద పండుగలా వేడుక చేసుకున్నారు. మొట్టమొదట అయోధ్య వాసులు దీపావళి చేశారు, తరువాత మొత్తం దేశం అంతా కూడా దీపావళి వేడుక చేసుకోవటం ప్రారంభించారు అని ఉత్తరప్రదేశ్ లో ఇది ఒక కథ. ఇప్పుడు నేను చెప్పినవి దీపావళి గురించి చెప్పుకొనే బాహ్యమైనటువంటి కథలు. ఇక్కడ మనము గ్రహించవలసింది ఏమిటంటే, దీపావళి రోజున రామచంద్రమూర్తి అయోధ్య చేరుకున్నాడు. అయోధ్య చేరుకున్న రామచంద్రమూర్తిని దీపావళి రోజున మన హృదయంలోనికి ఆహ్వానించుకోవాలి. మన హృదయంలో పదిలం చేసుకోవాలి. ఆయనను ఆరాధించాలి, పూజించాలి. అదీ మనము అందరమూ చేయవలసిన పని.

రామచంద్రమూర్తి మన హృదయంలోనే ఉన్నాడు. మన హృదయంలోనే ఆనందం ఉంది, శాంతి ఉంది. ఈ సంసారచక్రంలో నుంచి విడుదల అవ్వటానికి, మన హృదయంలో ఉన్న వస్తువుని తెలుసుకొంటేనే విడుదల అవుతాము కానీ బాహ్యమైన ప్రక్రియల వల్ల విడుదల అవ్వలేము. బాహ్యముగా ఏదో మనము చేసినా, ఇవన్నీ తాత్కాలికం. ఏదైనా మంచి పనులు చేస్తే పుణ్యము వస్తుంది, చెడ్డ పనులు చేస్తే పాపం వస్తుంది. ఇవన్నీ లోకానికి సంబంధించిన విషయాలు. ఈ పుణ్యం, పాపం, పుట్టుక, చావు, సుఖం, దుఖం, సంతోషం,

శాంతి, అశాంతి, కష్టాలు, నష్టాలు, , బాధలు, భారాలు, మొత్తము ఈ సమస్త గొడవలలోనుంచి, విడుదల పొందాలి. ఈ గొడవలు అన్నీ స్వప్నం. పుట్టుక చావు స్వప్నము, ఎప్పుడైనా సుఖము వస్తుంది, ఎప్పుడైనా కష్టము వస్తుంది, అవి కూడా స్వప్నమే. మీకు ఎప్పుడైనా సంతోషం వస్తుంది, ఎప్పుడైనా అశాంతి వస్తుంది, అది కూడా స్వప్నమే. మీ జీవితంలో హెచ్చుతగ్గులు అన్నీ స్వప్నమే! అయితే అది స్వప్నమని ఇప్పుడు మనకు తెలియదు, మన హృదయంలో ఉన్న వస్తువు తెలిసాక తెలుస్తుంది. అప్పటివరకూ అవన్నీ నిజము అనుకుంటాము.

ఈ మహాస్వప్నములోనుంచి మనము విడుదల పొందాలి అంటే, మన హృదయంలో ఉన్న బంగారము (ఆత్మ)ను తెలుసుకోవాలి. ఇంకొక దారి లేదు. అయితే మీ హృదయములో ఉన్న బంగారాన్ని తెలుసుకోవటానికి, మీరు భక్తిమార్గంలో ప్రయాణం చేయండి, కర్మమార్గంలో ప్రయాణం చేయండి, జ్ఞానమార్గంలో ప్రయాణం చేయండి, ఏ మార్గంలో ప్రయాణం చేసినా, నది వెళ్ళి సముద్రంలో కలిసినట్టు, మన హృదయంలో ఉన్న బంగారములో మనం ఐక్యం అవ్వాలి. అప్పటివరకూ గతి లేదు మనకి. అదే గతి! మనము చెప్పుకునే మిగతా గొడవలు అన్నీ మహా స్వప్నం!

దీపావళి గురించి భగవాన్‌ను అడిగితే అప్పుడు భగవాన్ ఇలా చెప్పారు, నరకం ఎక్కడో లేదు, ఈ దేహమే నరకం. మరి నరకాసురుడు ఎవరు అంటే, ఈ దేహం నాది, ఈ దేహం నాది, అని మనందరమూ అనుకొంటున్నాము, కనుక మనమే నరకాసురులము. అలా అంటే అందరికీ కోపాలు వస్తునాయి కదా, ఈ దేహం నేను అనే బుద్ధి అందరికీ ఉంది కదా. ఈ దేహాన్ని నేను అనుకునేవాడే నరకాసురుడు. నరకాసురుడు ఎవరో అనుకొంటున్నాము, కాని మనము అందరమూ నరకాసురులమే!

ఆ నరకాసురుడిని కృష్ణుడు చంపాడు. ఈ దేహాన్ని నేను అనుకొనే బుద్ధిని, విచారణ చేసి ఎవడైతే పోగొట్టుకుంటాడో, వాడు నరుడు కాదు, వాడు నారాయణుడు అవుతాడు. దేహాత్మబుద్ధి ఉన్నవాడు నరకుడు, దేహాత్మబుద్ధిని పోగొట్టుకొన్నవాడు నారాయణుడు. మీరు ఎపుడైతే ఆత్మని తెలుసుకున్నారో, ఆరోజునే దీపావళి. ఎంత బాగుందో చూశారా! ఏ రోజున అయితే మీరు సత్యాన్ని తెలుసుకున్నారో, ఏరోజున అయితే మీరు ఆత్మని దర్శించారో, మీ స్వరూపం ఎప్పుడు అయితే మీకు దర్శనం ఇచ్చిందో, అదే దీపావళి. మీకు ఎప్పుడైతే జ్ఞానం కలిగిందో ఆ రోజే దీపావళి. మీ హృదయంలోని వెలుగుని మీరు ఎప్పుడైతే చూడగలిగారో అదే నిజమైన దీపావళి!

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 26 డిసెంబర్ 1982, అరట్లకట్ట

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

కురుక్షేత్రంలో వాసుదేవస్వామి భారతయుద్ధం జరిగే ముందు అర్జునుడికి చెప్పిన శాస్త్రం భగవద్గీత. వాసుదేవుడు యుద్ధ భూమిలో ఈ గీతా శాస్త్రాన్ని ప్రవచించాడు. గీతని మీరు చదివితే ప్రపంచంలో ఎన్ని గ్రంథాలు అయితే ఉన్నాయో అన్ని గ్రంథాలు మీరు చదివినట్టే. వాసుదేవస్వామికి నమస్కారం పెడితే అందరి దేవతలకి నమస్కారం పెట్టినట్టే. మీరు గంగానదిలో స్నానం చేస్తే అన్ని నదుల్లోనూ స్నానం చేసినట్టే. ఈ శరీరంలో మనకి ప్రాణం ఎంతకాలం అయితే ఉంటుందో, అంతకాలం కూడా మనం భగవంతుడిని విడిచి పెట్టకూడదు, గురువుని విడిచి పెట్టకూడదు, శాస్త్రాన్ని విడిచి పెట్టకూడదు. మనం ఎంత జ్ఞానం సంపాదించినా సరే ఈ మాయ ఎప్పుడు కమ్మేస్తుందో మనం చెప్పలేము. అందుచేత ఈ మూడింటిని మనం విడిచి పెట్టకూడదు.

భగవద్గీతలో ప్రతీ అధ్యాయం చివర కూడా ఏమని చెబుతాడు అంటే శ్రీమద్భగవద్గీత ఉపనిషత్తు అంటే భగవంతుడు చెప్పాడు కాబట్టి ఇది భగవద్గీత అయ్యింది. తరువాత ఏమన్నారు ఉపనిషత్తు అన్నారు. అంటే వేదముల యొక్క సారం ఉపనిషత్తులు. ఆ ఉపనిషత్తులలో సారం అంతా కూడా భగవద్గీతలో చెప్పబడింది. అంటే నాలుగు వేదాల్లోని సారం అంతా కూడా ఈ భగవద్గీతలో చెప్పబడింది. తరువాత ఏమన్నారు, బ్రహ్మవిద్య అన్నారు. బ్రహ్మవిద్య అంటే ఏమిటి పరబ్రహ్మని ఎలా పొందాలో చెప్పే విద్య బ్రహ్మ విద్య. తరువాత ఏమన్నారు యోగశాస్త్రం అన్నారు. యోగశాస్త్రం అంటే ఏమిటి, కర్మయోగం గురించి చెప్పింది, భక్తి యోగం గురించి చెప్పింది, తరువాత సాంఖ్య యోగం గురించి చెప్పింది. సాంఖ్య యోగం అంటే ఏమిటి, ఏది నిత్యం - ఏది అనిత్యం, ఏది సత్యం - ఏది అసత్యం, ఏది శాశ్వతం - ఏది అశాశ్వతంఅని విడదీసింది. ఏది నిత్యం - ఏది అనిత్యం అని విడదీసి సాంఖ్యయోగం చెప్పింది కాబట్టి దీనిని యోగశాస్త్రం అన్నారు. తరువాత ఏమన్నారు? కృష్ణార్జున సంవాదం అన్నారు. అర్జునుడు అడగడం, కృష్ణుడు సమాధానం చెప్పడం. వాళ్ళిద్దరి మధ్యన జరిగిన సంభాషణ కాబట్టి కృష్ణార్జున సంవాదం అని చెప్పారు. ఈ విషయం

ఎందుకు చెప్పాడు అంటే సర్వ సాధారణంగా ప్రతీ అధ్యాయం చివర ఇవి వస్తాయి కదా అవి మీకు తెలిసుంటే మంచిదని చెప్పారు. దైవీసంపద గురించి స్వామివారు గీతలో చెప్పారు.

**అభయం సత్త్వ సంశుద్ధిర్జ్ఞానయోగవ్యవస్థితిః ।**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥ 1 ॥**

**అహింసా సత్యమక్రోధస్త్యాగః శాంతిరపైశునమ్ ।**
**దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥ 2 ॥**

**తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో నాతిమానితా ।**
**భవంతి సంపదం దైవీమభిజాతస్య భారత ॥ 3 ॥**

అభయం అంటే భయం లేకుండా ఉండమని చెప్పారు. మాటలు తేలికగా ఉంటాయి, కానీ అర్థం చేసుకోవటం కష్టం, ఆచరించటం కష్టం. కొంతమంది అంటూ ఉంటారు వినగానే సరిపోయిందా అని, అసలు వినకపోతే ఎలా అర్థం అవుతుంది. వినగానే సరిపోయిందా అనే మాట మీరు ఎవరు పట్టించుకోకండి. లౌకికులు చెప్పే మాటలు అవి. లౌకికుల తోటి మన స్నేహాలు తొందరగా తగ్గించుకోవాలి. శంకరాచార్యుల వారికి పద్మపాదుడు అనే ఒక శిష్యుడు ఉండేవాడు. ఆయన ఆచార్యస్వామి వారి దగ్గర, ఏవండీ స్వామి నాకు యాత్రలు చెయ్యాలని ఉంది అని అన్నాడు. ఆచార్య స్వామి వారు అలా రెండు నిమిషాలు మౌనంగా ఉండి, ఈ ప్రపంచంలో చూసేది ఏముంది? అవి చూస్తాను, ఇవి చూస్తాను అంటున్నావు ఏముంది చూడటానికి ఈ ప్రపంచంలో? అయినా నేను చూస్తాను అంటున్నావు కాబట్టి నీ కోరిక నెరవేర్చుకో, కానీ నీ ప్రయాణంలో పరిచయం లేని వాళ్ళని తొందరగా నమ్మవద్దు అని చెబుతూ ఒక మాట చెప్పారు. ఆడంబరంగా మాట్లాడే వాళ్ళతోటి, ఆడంబరంగా వేషం వేసేవాళ్ళ తోటి స్నేహం చెయ్యకు అన్నారు. సత్పురుషుల యొక్క సహవాసం చెయ్యి అని చెప్పారు. సత్పురుషుల సహవాసం దొరికితే మటుకి విడిచి పెట్టకు అని చెప్పారు. సత్పురుషుల సహవాసం ఎలా ఉంటుంది అంటే, ఆచార్యస్వామి వారు ఏమని చెప్పారు అంటే చేసినంత సేపు చాలా బాగుంటుంది కానీ వాళ్ళని విడిచి పెట్టేటప్పుడు మటుకి కొంత దుఃఖం కలుగుతుంది. అదొక్కటే లోటు అందులో అన్నారు.

సాధ్యమైనంత వరకు మనం లౌకికులతోటి స్నేహాలు తగ్గించుకోవాలి, ఎందుచేత

అంటే వాళ్ళు మనకి ప్రోత్సాహం ఇవ్వరు, నిరుత్సాహ పరుస్తారు. మనలని ప్రగతి వైపుకి తీసుకుని వెళ్ళరు. ఇక్కడ స్వామి ఏమని చెబుతున్నాడు అభయం అంటే భయం లేకుండా ఉండండి అని స్వామి చెప్పారు. అంటే స్వామి వారు పరమాత్మ. అర్జునుడు జీవాత్మ. మనం అందరం జీవులమే కదా, అర్జునుడితోటి చెబుతున్నాడు అంటే మనకి చెబుతున్నట్టు లెక్క. అర్జునుడికి చెప్పే ప్రతీ మాట మనకి కూడా వర్తిస్తుంది. భయం లేకుండా ఉండండి. ఈ మాటలు ఎంత తేలికగా ఉన్నా భయం లేకుండా ఎవరు ఉండగలరు? మనకి ప్రాణం ఎంత కాలం ఉందో అంతకాలం భయం వేస్తూనే ఉంటుంది. ఇందులో ఒక రహస్యం ఉంది. మనకి భయం ఉండకూడదు, భయం ఉండకూడదు అని ఎంత అనుకున్నప్పటికీ లోపల అజ్ఞానం ఉన్నంతకాలం భయం ఏదో ఒక మూల నుండి వచ్చేస్తూ ఉంటుంది. మనిషి లోపల ఎంతకాలం అయితే అజ్ఞానం ఉందో, ఈ అజ్ఞానం ఉన్నంత కాలం భయం తప్పనిసరిగా వచ్చేస్తుంది. అయితే ఈ శరీరం పడిపోతుంది కదా, మనకి మళ్ళీ కొత్త దేహం వస్తుంది కదా, అక్కడా భయం వేస్తుంది మళ్ళీ, ఎందుచేత లోపల అజ్ఞానం ఉంది కాబట్టి, దేహం పడిపోయింది కానీ అజ్ఞానం పోదు. సర్వ సాధారణంగా భయం మనకి ఎక్కడ వస్తుంది అంటే మనకి ఇష్టమైన వస్తువు ఏదైనా ఉంటే అది పోతే భయం వేస్తుంది. మనకి ఇష్టం లేని వస్తువు వచ్చి మీద పడుతుంది అనుకోండి అప్పుడు భయం వేస్తుంది. మనకి చావు కూడా భయం వల్ల వస్తుంది అన్నాడు వివేకానంద స్వామి, మరణించే టైములో కూడా మనం ప్రశాంతంగా ఉండగలగాలి. ఎవడు మటుకి వాడు మనసులో ఏమి జరుగుతుందో చూడటం నేర్చుకోవాలి. అలా చూడటం నేర్చుకోవాలి అంటే భక్తి కావాలి.

తరువాత సత్త్వ సంశుద్ధిః సత్త్వ సంశుద్ధిః అంటే ఏమిటి? అంతఃకరణ శుద్ధి. శరీరం శుద్ధిగా ఉందో లేదో చూసుకుంటాం మంచిదే. కానీ అంతఃకరణ శుద్ధి, లోపల మనసు



**మీరు ప్రకృతి మనుషులతోటి స్నేహాలు చెయ్యకండి. ప్రకృతి మనుషులతోటి చాలా ప్రమాదం. వాళ్ళతోటి స్నేహాలు ఎంత తగ్గించుకుంటే అంత యోగంలో మనం అభివృద్ధి పొందగలం.**

ఎంతవరకు శుద్ధిగా ఉంది, ఎంతవరకు నిర్మలంగా ఉంది అనేటటువంటి పరిశీలన మనకి రాదు. అంతఃకరణ శుద్ధి ఎవరికి వస్తుంది అంటే మీరు ఏది ఆలోచిస్తారో అది మాట్లాడాలి. ఏది మాట్లాడుతున్నారో అది చెయ్యాలి. ఇలా చేస్తే వాళ్లకి అంతఃకరణ శుద్ధి వస్తుంది. దీనిని త్రికరణ శుద్ధి అంటారు. ఏది ఆలోచిస్తున్నారో అది మాట్లాడాలి. ఏది మాట్లాడుతున్నారో అది చెయ్యాలి. ఇప్పుడు మీరేమి కష్టపడక్కర్లేదు మీరేమి టెన్షన్ పడకండి. మీరు ఇక్కడకి వచ్చి కూర్చున్నప్పుడు ఎటువంటి భావాలు ఉన్నాయో, ఆ భావాలు జాగ్రత్తగా మూట కట్టి ఒక పక్కన పెట్టుకుంటే మళ్ళీ మీరు ఇంటికి వెళ్ళినప్పుడు ఆ భావాలు అన్నీ పట్టుకు పోవచ్చు. ఎందుచేత అంటే ఆ భావాలే కనుక మీరు మనసులో పెట్టుకుని కూర్చుంటే నేను చెప్పేది మీకు లోపలకి వెళ్ళదు. ఎందుచేత అంటే లోపల ఖాళీ లేదు కదా, అందుచేత మీరు కాసేపు ఖాళీ చేస్తే, నేను చెప్పిన భావాలు అన్నీ లోపలకు వెళతాయి అవి మీకు ఎప్పుడైనా జీవితంలో పని చేస్తాయి. లౌకికుల కంటే మనం ఇందులో కష్టపడవలసిన పని ఏమీ లేదు. లౌకికులు ఏమి చేస్తారు? వాళ్ళ మనస్సుని, వాళ్ళ వాక్కుని, వాళ్ళ శరీరాన్ని ప్రపంచానికి ఖర్చు పెడుతూ ఉంటారు. వాళ్ళకంటే మనము ఎక్కువ శ్రమ పడక్కర్లేదు. వాళ్ళు ప్రపంచానికి ఖర్చు పెడుతున్నారు. మనం ప్రపంచానికి అధిష్టానంగా ఉన్న పరబ్రహ్మ కోసం మన వాక్కుని, మన మనస్సుని, మన శరీరాన్ని ఖర్చు పెడుతున్నాం. వాళ్ళేమో ప్రపంచం కోసం ఖర్చు పెడుతున్నారు. మనం ఆత్మని తెలుసుకోవడం కోసం దీనిని ఖర్చు పెట్టాలి. అంతటా వ్యాపించిన పరబ్రహ్మ నాలో కూడా ఉంది. అది ఎలా ఉంది? ఆత్మగా ఉంది. ఆత్మ వల్లే నేను చూస్తున్నాను, నేను వింటున్నాను, నేను మాట్లాడుతున్నాను. నేను కళ్ళతోటి చూస్తున్నాను అనుకుంటాను. శవానికి కూడా కళ్ళు ఉంటాయి కదా, ఆ కళ్ళని చూడమనండి. శవానికి కళ్ళు ఉంటాయి కానీ చూడవు. నోరు ఉంది కదా మాట్లాడమనండి, మాట్లాడదు. శవానికి కూడా చెవులు ఉన్నాయి కదా కానీ వినవు అవి. ఎందుచేత కళ్ళకు చూసే శక్తి ఇచ్చే ఆత్మ, చెవులకి వినే శక్తి ఇచ్చే ఆత్మ, నోటికి మాట్లాడే శక్తి ఇచ్చే ఆత్మ, నాలుకకి రుచి చూసే శక్తి ఇచ్చే ఆత్మ తప్పుకుంటే ఈ గోళాలు పనిచేయవు. మనం ఏమనుకుంటున్నాం. కళ్ళే చూస్తున్నాయి అనుకుంటున్నాం. కళ్ళకే నిజంగా చూసే శక్తి ఉంటే శవం కళ్ళు కూడా చూడాలి. అంటే మనం అందరం ఏమి చేస్తున్నాం, శవ పూజ చేస్తున్నాం కానీ శివ పూజ చెయ్యటం లేదు. శవ పూజ అంటే ఏమిటి? ఈ శరీరానికి సేవ చేసుకుంటూ ఉంటాం

మనం, కానీ ఇందులోని శివుడిని తెలుసుకోవాలి అనే ప్రయత్నం మనకి ఏమి లేదు. అందుచేత మనం ఆ ప్రయత్నం చెయ్యాలి. దానికి తగినటువంటి భక్తి ఉండాలి. తగినటువంటి గురువు దొరకాలి. శాస్త్రం అంటే గౌరవం ఉండాలి. ఈశ్వరుడు మీద గౌరవం ఉండాలి. గురువు అంటే మనల్ని బాధించేవాడు గురువు కాదు. మీరు తప్పనిసరిగా ఇలా చేసి తీరండి అని చెప్పకూడదు, మీ మనస్సు ఫ్రీగా ఉండాలి, ఆలోచించగలగాలి. మీరు బలవంతంగా ఈ విషయాన్ని నమ్మండి అని నేను చెప్పకూడదు మీకు. మీకు విషయాలు ఎదురుగా ఉంచాలి, మిమ్మల్ని ఆలోచించమని చెప్పాలి. ఏడు వందల శ్లోకాలు చెప్పాడు ఇక్కడ వాసుదేవ స్వామి. అన్నీ చెప్పి ఆలోచించుకుని నీకు నచ్చితే పని చెయ్యి, లేకపోతే లేదు అన్నాడు చివరకి. అంతేకానీ గదిలోనే కూర్చుని చచ్చిపో అని చెప్పలేదు ఆయన. శాస్త్రం వినవచ్చు, శాస్త్రం చదవచ్చు, సత్సంగం చేయచ్చు కానీ మీ అంతట మీరు ఆలోచించుకోకపోతే మీరు మానసికంగా ఎదగరు.

నేను మొన్న పూరీ జగన్నాథస్వామి గుడికి వెళ్ళాను. సముద్రం పక్కన ఒక సమాధి చూశాను. ఆ స్వామి పేరు హరిదాసు. ఆ హరిదాసు ముస్లిం మతస్తుడు కానీ అతనికి కృష్ణుడు అంటే ఎంతో ప్రేమ, అతను కృష్ణుడు కోసమే జన్మించాడు, కృష్ణుడు కోసమే జీవించాడు, కృష్ణుడు కోసమే మరణించాడు హరిదాసు. అవ్వటానికి ముస్లిం మతస్తుడే, కానీ కృష్ణుడు అంటే ఎంతో భక్తి. కృష్ణా, కృష్ణా, కృష్ణా అని రోజుకి కొన్ని లక్షలు చేసేవాడు. శ్రీకృష్ణ చైతన్యుడికి శిష్యుడిగా ఉండేవాడు హరిదాసు. అతను ఒక రోజున శ్రీకృష్ణ చైతన్యుడితో చెపుతున్నాడు నాకు పెద్ద వయస్సు వచ్చేసింది, శరీరం వడలిపోయింది, భగవంతుడి యొక్క నామం నాకు చెయ్యడానికి ఓపిక తగ్గుతోంది, అందుచేత ఈ శరీరంలో ఉండడం నాకు ఇష్టం లేదు. మీరు లేని లోకాన్ని నేను చూడలేను, ఆ గురు భక్తి చూడండి. కృష్ణ చైతన్యుడితో చెబుతున్నాడు హరిదాసు, మీరు ఉండగానే నేను వెళ్ళిపోతే మంచిది. మీరు లేని ఈ లోకాన్ని నేను చూడలేను. అందుచేత మీ చేతుల తోటి నన్ను పంపేయండి అని హరిదాసు కృష్ణ చైతన్యుడితో అంటున్నాడు, ఒక రోజు ఉదయం హరిదాసు కొంతసేపు కృష్ణ నామం చేశాడు. చైతన్యుడి పాదాలలో ఉన్నటువంటి ధూళి కొంత తీసుకుని ఒంటికి రాసుకున్నాడు. నమస్కారం పెట్టాడు, ఒక పది నిమిషాలలో ప్రశాంతంగా ప్రాణం విడిచి పెట్టాడు. శ్రీ కృష్ణ చైతన్య ఆయనను ఒళ్ళో పెట్టుకుని ఆయన చేతుల తోటి హరిదాసుని సమాధి చేశాడు. ఆ


సమాధిని నేను మొన్న పూరీలో చూశాను. ఎప్పుడో 400 సంవత్సరాల పూర్వం నాటిది.

అంతఃకరణ శుద్ధి లేకపోతే జ్ఞానం కలగదు. హృదయశుద్ధి కలవారు ధన్యులు వారు దేవుడిని చూచెదరు. అందుచేత హృదయం నిర్మలంగా ఉండాలి. పవిత్రంగా ఉండాలి. అంటే ఇవన్నీ మనం సంపాదించుకోవాలి. మన శరీరం ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటున్నామో, లోపల మనసుని కూడా అంత పరిశుద్ధంగా ఉంచుకోవాలి. అంటే మనకి లేని వస్తువుని మనం భౌతికంగా ఎలా సంపాదించుకుంటున్నామో, అలా ఇవి కూడా మనం కష్టపడి సంపాదించుకోవాలి అంతఃకరణ శుద్ధి.

జ్ఞానయోగవ్యవస్థితిః రెండో అధ్యాయంలో చెబుతాడు వాసుదేవుడు. సమత్వం యోగ ఉచ్యతే. సమానంగా ఉండటం యోగం అన్నాడు. పిల్లలు పని చెయ్యకపోతే వాళ్లకి బుద్ధి చెపుతాం. కానీ మన బుద్ధికి బుద్ధి చెప్పుకోము. మీరు పిల్లలకి బుద్ధి చెప్పండి మంచిదే. కానీ మీ బుద్ధిలో ఏమి జరుగుతుందో కూడా మీరు చూసుకోవాలి. నా బుద్ధికి కూడా నేను బుద్ధి చెప్పుకుంటూ ఉండాలి. బుద్ధిలోని వంకరలు తీసేయాలి. బుద్ధి నిదానంగా రావాలి. అన్ని దానాల్లోనూ నిదానమే గొప్పది. అందుచేత నిదానం మనకి కావాలి. సమత్వం యోగ ఉచ్యతే. సమానంగా ఉండటం యోగం. అంటే ఏమిటి, సమానంగా ఉండి పని చెయ్యమన్నాడు. జ్ఞానయోగవ్యవస్థితిః. మీరు శాస్త్ర జ్ఞానాన్ని వినాలి. అంటే మీరు శ్రవణ రహితులుగా ఉండకూడదు. శ్రవణం చెయ్యాలి. మనన రహితులుగా ఉండకూడదు, మననం చెయ్యాలి. శ్రవణం చెయ్యాలి, మననం చెయ్యాలి. దానిమీద ధ్యాస పెట్టుకోవాలి, విన్నదాని మీద ఆసక్తి పెట్టుకోవాలి. భగవద్గీతలో ప్రతీ అక్షరానికి అర్థం ఉంది. మనకి ఒక్క అక్షరం అర్థం అయితే చాలు. ఇక్కడ స్వామి ఏమి చెబుతున్నారు నువ్వు యోగంలో ఉండు అంటే హెచ్చుతగ్గులు లేకుండా, రాగ ద్వేషాలు లేకుండా, కామ క్రోధాలు లేకుండా పని చెయ్యి, యోగంలో ఉండి చేయమన్నారు. అంటే మీరు స్వామి చెప్పినట్టు చెయ్యకుండా, మీకు ఇష్టం అయినట్లు చేస్తుంటే మిమ్మల్ని కర్మ బంధిస్తుంది. తల్లి కడుపులోంచి శరీరం బయటకి వచ్చినది మొదలు మళ్ళీ స్మశానంకు తీసుకెళ్ళి దీనిని కాల్చేసే వరకు శరీరం ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. పని చేసిన వెంటనే వాసన పుడుతుంది. ఆ వాసన హృదయం లోనికి వెళ్ళిపోతుంది. దానిని బట్టి మీకు పునర్జన్మ వస్తుంది. ఆ వాసనను బట్టి అప్పుడు

పని చేస్తారు. అందుచేత మీరు పని చేయాలి, మీకు వాసనలు రాకూడదు. అదిఎలాగో చెబుతున్నారు. యోగంలో ఉండి కనుక పని చేస్తే, రాగ ద్వేషాలు లేకుండా, కామ క్రోధాలు లేకుండా పని చేస్తే మీకు పని అయ్యిపోతూ ఉంటుంది, వాసన పుట్టదు. వాసన పుట్టకపోతే మీకు జన్మ రాదు. అంటే మీకు వాసన ఎప్పుడైతే వస్తుందో అప్పుడు జన్మ తప్పక వస్తుంది, జన్మ వచ్చాక సృష్టి వచ్చేస్తుంది. మనసుని సమానంగా ఉంచుకుని కనుక పనిచేస్తే, అహంకారం పెట్టుకోకుండా పనిచేస్తే, ఆ పని మిమ్మల్ని అంటదు. మీలో వాసనలు పుట్టవు. పైగా మీలో పూర్వం ఉన్న దోషాలు అన్నీ బయటకి పోతాయి.

జిడ్డు కృష్ణమూర్తి గారు ఏమన్నాడు అంటే action ఉండాలి కానీ reaction ఉండకూడదు అన్నాడు. Action ఉండాలి మనిషికి, reaction ఉండకూడదు. Action అంటే ఏమిటి మీరు పని చేసుకుంటూ పోతూ ఉండాలి. చాలా జాగ్రత్తగా వినండి. నేను ఇక్కడ ప్రసంగం గీతా ప్రవచనం ఇక్కడ చేస్తున్నాను. మీరు చెప్పిన మాటలు ఏమీ బాగాలేదు అని మీరు నన్ను అనచ్చు. చాలా బాగుంది అని ఇంకొకరు అనచ్చు. ఆ మాటల వల్ల నా మనసులో వికారం పుట్టకూడదు, అంటే ఏమిటి నేను చెప్పటమే కానీ, మళ్లీ మీ యొక్క భావాల లోంచి మీ యొక్క reaction నాకు తగలకూడదు. ఇప్పుడు మీరు నన్ను ఏదో విమర్శించారు అనుకోండి మీ విమర్శ నాలో కోపం కింద మారుతుంది, మీరు విమర్శించినప్పుడు నాకు కోపం రావడం ఎందుకు, బాగా అర్థం చేసుకోండి. మరి జ్ఞానికి ఎందుకు కోపం రావడం లేదు, నాకెందుకు కోపం వస్తుంది. అంటే జ్ఞాని హృదయంలో అహంకారం ఉండదు, అజ్ఞాని హృదయంలో అహంకారం ఉంటుంది. అందుచేత ఈ అహంకారం ఉన్నంతసేపు వాసనలు పుట్టుకు వస్తూ ఉంటాయి. అలా వాసనలు వచ్చినంత సేపు మనం పని చేస్తాం. అంటే ఈ



**ఈ ప్రపంచం నిజమా అబద్ధమా అని రమణమహర్షి గారిని అడిగితే నిజమని చెప్పలేదు, అబద్ధమని చెప్పలేదు. నిజములాగా కనిపిస్తోంది అంతే అన్నారు. వండర్ఫుల్ ఎక్స్‌ప్రెషన్.**

**నిజములాగా కనిపిస్తోంది, అంటే అది నిజము కాదు కానీ నిజము వలె కనిపిస్తోంది.**

సృష్టిలోంచి ఎవరూ బయటకి తప్పుకోలేరు.

యోగస్థః కురు కర్మాణియోగంలో ఉండి పని చెయ్యి. అయితే భగవంతుడు ఒక మాట చెప్పాడు, పని చెయ్యమని చెప్పాడు, ఫలితాన్ని ఆశించవద్దు అని చెప్పాడు. అంటే ఫలితాన్ని కోరేవాడు జీవుడు అన్నారు వాసుదేవ స్వామి. ఫలితాన్ని కనుక విడిచి పెట్టేస్తే, ఫలితాన్ని మనం కోరకుండా ఉంటే ఫలితం రాదని ఆయన చెప్పలేదు. ఇక్కడ మీరు బాగా అర్థం చేసుకోండి. మీకు ఫలితం రాదు అనుకోకండి, వస్తుంది. మీకు కోరిక ఉంటే అది మిమ్మల్ని బంధిస్తుంది. కోరుకోకపోయినా అది వస్తుంది అప్పుడు అది బంధించదు. మీరు ఏమనుకుంటున్నారు అంటే నేను కోరిక కోరుకుంటే పని జరుగుతుంది. కోరిక కోరుకోకపోతే ఈ పని జరగదేమో అనుకొంటున్నారు. కానీ అది జరగవలసిన యోగం ఉంటే టైముకి అలా జరిగిపోతుంది. జ్ఞాన యోగ వ్యవస్థితిః శాస్త్రాన్ని శ్రద్ధగా వినటం, విన్న దానిని మననం చెయ్యటం, దాని యందు ఆసక్తి కలిగి, నిష్ఠ కలిగి, ధ్యాస కలిగి ఉండటం జ్ఞాన యోగ వ్యవస్థితిః

దానం, దానం చెయ్యమంటున్నాడు. దానం అంటే ఏమిటి, మీరు సారా తాగేవాడికి దానం చేస్తే, ఆ పాపంలో కొంత భాగం మీరు పంచుకోవాలి. మీరు మాములుగా మీకు రూపాయలు ఉన్నాయి కదా అని ఏ సారా తాగే వాడికో దానం చేస్తారు అనుకోండి మాటవరసకి, ఆ పాపం ఫలితం మీరు కొంత అనుభవించాలి. దానం అంటే పాత్రత తెలిసుండి, అర్హత తెలిసుండి దానం చెయ్యమంటున్నాడు. మీరు రాజులా, బ్రాహ్మణులా అని భగవద్గీత అడగడం లేదు. మీరు స్త్రీలా, పురుషులా అని భగవద్గీత అడగడం లేదు. లేకపోతే మీరు పిల్లలా, పెద్దలా అని కూడా అడగడం లేదు. మీరు ఏ వర్ణమో భగవద్గీతకి అక్కర్లేదు. మీరు శ్రద్ధగా వింటున్నారా లేదా, ఏకాగ్రంగావింటున్నారా లేదా, విన్న దానిని విశ్వసిస్తున్నారా లేదా, మీలో పవిత్రత ఉందా లేదా, అర్హత ఉందా లేదా, యోగ్యత ఉందా లేదా, అది అడుగుతుంది కానీ, మీరు ఏ వర్ణమో, ఏమిటో ఇక్కడ భగవద్గీత అడగడం లేదు. మనకి ధాన్యం విత్తనాలు ఉన్నాయి అనుకోండి. మనం చేలో వెళ్లి చల్లుకుంటాం కానీ రోడ్డు మీద చల్లుతామా, అదే విధంగా మీ దగ్గర రూపాయలు ఉన్నాయి కదా అని, అర్హత లేనివాడికి ఎప్పుడూ దానం చెయ్యకండి. యోగ్యత లేనివాడికి దానం చెయ్యకండి. అదేమి అవుతుంది. అంటే దానివల్ల చాలా ఇబ్బందులు ఉంటాయి. ఆ కర్మదోషం మీరు కొంత భవిష్యత్ జన్మలలో అనుభవించ

వలసి ఉంటుంది. కర్మ చేశారా పీడించేస్తుంది, ఏ జీవి తప్పించుకోలేడు. ఎవరికీ తెలియకుండా మీరు వంటింట్లో కూర్చుని మనస్సులో ఒక భావన చెయ్యండి ఆ భావన కూడా మిమ్మల్ని పీడించేస్తుంది. దానికి ఉపనిషత్తులో ఒకమాట చెప్పారు. వంద ఆవులను ఒక చోట కట్టేసి ఒక దూడని విడిచి పెట్టేస్తే ఆ వంద ఆవుల దగ్గరకి దూడ వెళ్ళదు. దాని తల్లి ఏదైతే ఉందో ఆ తల్లి దగ్గరకే ఈ దూడ వెళ్ళి పాలు తాగుతుంది. మీరు మర్చిపోతారు, నేను మర్చిపోతాను, ఈశ్వరుడు ఎలా మర్చిపోతాడు. ఈశ్వరుడు సర్వజ్ఞుడు. ఈశ్వరుడికి ప్రాజ్ఞుడు అని పేరు. ఈశ్వరుడికి ఈ సృష్టిలో ఏది, ఎక్కడ జరుగుతుందో అన్నీ తెలుసు. అందుచేత ఈశ్వరుడికి ఏమని పేరు పెట్టారు? ప్రాజ్ఞుడు. శబ్దాన్ని అర్థం చేసుకోవాలి ఊరికే తొందర పడితే కాదు. అర్థం అవ్వాలి మనకి, అర్థం అయితే ఆచరించాలి అని ఉంటుంది. అర్థం అవ్వకపోతే ఆచరించాలి అని ఉండదు.

ధ్యానం చేసేటప్పుడు ఏకాంతంగా చెయ్యాలి. సబ్జెక్టుని డిస్కస్ చేసేటప్పుడు ఎప్పుడూ ఒక తల కంటే రెండు తలలు మంచివి. అందుచేత ఎప్పుడూ కూడా మనకి ఏమి తెలియనప్పుడు పక్కన ఉన్న వాళ్ళని తెలివైన వాళ్ళని అడగాలి. మనకంటే తెలివి తక్కువ వాళ్ళని అడగమని కాదు నేను చెప్పేది. మనకంటే తెలివైన వాళ్ళని కొంచెం అడగడం మంచిది. ఎందుచేత రెండు బుర్రలు పని చేసినప్పుడు ఒకొక్కసారి మంచి పాయింట్స్ వస్తాయి. ఆచార్య స్వామి వారు అన్నారు. ఈ ముఖానికి అలంకారం ఏమిటి? జ్ఞానమే. జ్ఞానం లేని జన్మ వృథా. జ్ఞానం లోపల నుంచి ఊరేది కానీ పైనుంచిపోసేది కాదు. ఎవరైనా వచ్చి ఎందుకండీ ఈ వేదాంతం. ఈ గొడవ అంతా మీకు ఎందుకు అంటారు అనుకోండి మనం కంగారు పడతాం. ఎందుచేత అంటే వాళ్ళకి ఆ భావాలు తెలియవు. వాళ్ళని విమర్శించటం కాదు. ఇప్పుడు మీరు చంటి పిల్లవాడి చేతిలో బంగారపు గొలుసు పెట్టండి, ఒక ఐదు పైసలు పెట్టి chocolate కొనిచ్చి ఈ chocolate తినరా అబ్బాయి ఆ గొలుసు నాకు ఇచ్చేయి అంటే వాడు గొలుసు ఇచ్చేస్తాడు ఈ chocolate కోసం. ఎందుచేత బంగారపు గొలుసు విలువ వాడికి తెలియదు. మనం కూడా ఆ పిల్లలు లాగే ఉన్నాం. మనలో ఉన్న నిజమైన ఆత్మ విలువ తెలియక భగవంతుడు అంటే ఏమిటి విలువ తెలియక, chocolate కోసం ఏ విధంగా అయితే చంటి పిల్లవాడు గొలుసు ఇచ్చేశాడో, అదే విధంగా ఈ లోక విషయాలు కోసం, ఈ లోకాభిరామాయణం చెప్పుకోవడం కోసం, ఆత్మని విడిచి పెట్టేస్తున్నాం.

బంగారపు విలువ తెలిస్తే ఆ కుర్రాడు బంగారం ఇస్తాడా? ఇవ్వడు. అదే విధంగా ఆత్మ విలువ కనుక మనకి తెలిస్తే, ఆత్మ గురించి సమగ్రంగా మనకి అర్థం అయితే మిగతా గొడవల్లోకి మనం వెళ్లం. వెళుతున్నాం అంటే ఆత్మ విలువ మనకు తెలియటం లేదు.

వైరాగ్యం అభ్యాసం చెయ్యి. వైరాగ్యం కలిగి ఉండు అని పరమాత్మ చెప్పాడు. వైరాగ్యముంటే, అభ్యాసముంటే మనసుని గ్రహించవచ్చు అని చెప్పాడు. వైరాగ్యం ఎవరికి వస్తుంది? ఇందులో ఒక చిన్న రహస్యం ఉంది. వైరాగ్యం ఉండాలి, వైరాగ్యం ఉండాలి, వైరాగ్యం ఉండాలి, ఇలా అనుకుంటే ఎవరికీ వైరాగ్యం రాదు. కాలం ఖర్చు అయిపోతుంది. ఏ ఇంద్రియం ఏ సుఖం అనుభవిస్తోందో ఆ సుఖం మీద ఆ ఇంద్రియానికి ప్రీతి పోవాలి. అప్పుడు వైరాగ్యం కలుగుతుంది.

ఇప్పటినుండి ఎందుకండీ? తర్వాత చూసుకోవచ్చు అని కొంతమంది అంటూ ఉంటారు. తర్వాత అంటే రేపు చచ్చిపోతాను అనేటప్పుడు చూసుకోమనా? సంవత్సరం పొడవునా చదివినా పాస్ అవ్వనివాడు రేపు పరీక్ష అనగా చదివితే పాస్ అవుతాడా? ఇంత కాలం నుండి ఇంత పొడుగునా మనం సాధన చేస్తుంటే మనకిఏమి గమ్యం దొరకటం లేదే? ఇంకో గంటకు మనకి ప్రాణం పోతుంది అనగా, ఈ ఉపనిషత్తులు, ఈ భగవద్గీత ఎదురుగా పెట్టుకుని కూర్చుంటాం అనుకోండి. అప్పుడేమైనా తరిస్తామా మనం. భగవంతుడు ఇంకోటి చెప్పాడు మరణించే టైములో ఎవడైతే నన్ను స్మరిస్తున్నాడో వాడు నన్ను పొందుతాడు అని, మరణించే టైములో మనకి ఆ స్మరణ రాదు. ఎందుచేత రాదంటే, మనకున్న మనసులోని గొడవలు అన్నీ వచ్చేస్తాయి. మనకు ప్రాణం పోయేటప్పుడు ఏమి చేస్తుంది అంటే, అన్నం ఉడికేటప్పుడు పైకి, కిందకి, పైకి, కిందకి తిరుగుతూ ఉంటుంది కదా! అలాగే కోరికలన్నీ వాసన రూపంలో తిరుగుతూ ఉంటాయి. అప్పుడు బలమైన కోరికలు ఏమి చేస్తాయి అంటే బలహీనమైన కోరికలని అణగ కొట్టేసి అవి పైకి వచ్చేస్తాయి. ఏ జన్మలోకి వెళితే, ఏ తల్లి కడుపులోకి వెళ్లి పుడితే, ఏ శరీరాన్ని కనుక మళ్ళీ తొడిగితే ఆ కోరిక నెరవేరుతుందో, దానికి అనుగుణంగా జన్మ వస్తుంది. మంచినీళ్లు దిగడం లేదు, చేతులు పడిపోయాయి, ఇంకా బ్రతికున్నాడా అనిపిస్తుంది, ఒకొక్కసారి మంచం మీద నుంచి కింద పెట్టేసినా వాడు అలా ఊగుతూ ఉంటాడు. అన్నం ఉడికేటప్పుడు గిన్ని పైకి, కిందకి వెళ్లినట్టు వాడికి లోపల ఘర్షణ జరుగుతూ ఉంటుంది. మీరు చాలా జాగ్రత్తగా వినండి. మీరు

కట్టురాడుకి తాడు వేసి దూడని కట్టేయండి. ఆ తాడు ఎంత లెక్క వెళ్లిందో, అంతలెక్క మేస్తూ ఉంటుంది పాపం. అంతకన్నా దూరం వెళ్లదు. అదే విధంగా మన మనస్సు అటు ఇటు తిరిగి అటు ఇటు తిరిగి మళ్లీ శరీరంలోకి వచ్చేస్తుంది ఎందుకు ప్రాణం ఇక్కడ ఉంది కదా. అందుచేత ప్రాణం ఏమో, తాడేసి కట్టేసినట్టు ఈ మనసుని కట్టేస్తుంది. ప్రాణం పోయేముందు ఏమి చేస్తుంది, ఈ ప్రాణం ఒక్కటే తప్పుకోదు, ఈ ప్రాణం పోయేముందు మనసుని కుదుపుతుంది, ఇలా ఎందుకు చెబుతున్నాను అంటే మనం అందరం ఎప్పుడో ఏదో రోజున పల్లకీ ఎక్కాల్సిందే. మనకి ప్రాణం పోయేటప్పుడు చాలా ఘర్షణ వస్తుంది అప్పుడు కృష్ణుడి గొడవ ఉండదు, రాముడి గొడవ ఉండదు, అరుణాచల శివుడి గొడవ ఉండదు. ఇప్పుడు పాడతాం హాయిగా కాఫీలు పుచ్చుకుని, హాయిగా ఇడ్లీలు తిని మరి మంగళ స్నానం చేసి, బొట్టు పెట్టుకుని కూర్చుని అరుణాచల శివ, అరుణాచల శివ అని పాడతాము. మంచిదే కాని మరణ సమయంలో జ్ఞాపకం రాదు అరుణాచల శివ. వస్తుంది ఏమో అనుకుంటారు రాదని చెబుతున్నాను.

ప్రాణం ఏమి చేస్తుంది మనసుని గుంజుతుంది. ఈ మనసు మొత్తం లోపల ఉన్న సంస్కారాలు అన్నిటిని పోగేసుకున్న తరువాత ప్రాణం తనలోకి మనస్సును లాగేసుకుని అప్పుడు శరీరాన్ని విడిచి పెట్టి ప్రయాణమై వెళ్లిపోతుంది. ఇది మరణించే టైములో ప్రతీవాడికి జరుగు తుంది. అందుచేత మనం పైకి మాట లేదు అనుకోకండి. లోపల చాలా గొడవ జరుగుతుంది. పైకి మనం ఏమనుకుంటాం, రెండు రోజులు నుండి మాట పడిపోయింది అనుకుంటాం.

అందుచేత భగవద్గీతలో ఏమి చెప్పాడు అంటే, ఈ లోకంలో ఎవడు బుద్ధిమంతుడు? ఎవడు జ్ఞాని? అంటే కర్మలో అకర్మని చూసేవాడు, ఆకర్మలో కర్మని చూసేవాడు, ఈ లోకంలో బుద్ధిమంతుడు. బుద్ధిమంతుడు అంటే జ్ఞానం కలవాడు. మనం అందరం బుద్ధిమంతులం

**నీ సుఖానికి దేహం మీద కాని, బాహ్యమైన విషయముల మీద గాని, వ్యక్తుల మీద గాని ఆధారపడకుండా నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు మీద ఆధారపడి ఉన్నప్పుడు నీకు ఆత్మనిష్ఠ కలుగుతుంది. అప్పుడు వేరుబుద్ధి నశించి, నీకు మోక్షం కలుగుతుంది.**



కాదు అని చెబుతున్నారు. ఎవరు బుద్ధిమంతులు అంటే కృష్ణుడి భజన చేసేవాడు, రాముడి భజన చేసేవాడు, శివుడి భజన చేసేవాడు, బుద్ధిమంతుడు అని చెప్పలేదు. నాకు నమస్కారాలు పెట్టేవాడు బుద్ధిమంతుడు అని చెప్పలేదు, అలా ఏమి చెప్పటం లేదు, హేతుబద్ధంగా చెబుతున్నాడు. సహేతుకంగా, ఎంత అందంగా చెబుతున్నాడో చూడండి, ఎవడు కర్మలో అకర్మను చూస్తాడో, ఎవడు అకర్మలో కర్మను చూస్తాడో వాడు బుద్ధిమంతుడు, వాడు జ్ఞాని, వాడు యోగి, వాడు భక్తుడు. కర్మలో ఆకర్మని చూడటం అంటే ఏమిటి? అంటే మీరు కర్మ చేస్తూ ఉండాలి, పని చేస్తూ ఉండాలి, నేను చేస్తున్నాను, నా వల్ల అవుతోంది అనే భావన రాకూడదు. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. కర్మ మనలని బంధిస్తుంది కాబట్టి మరీ చాదస్తంగా నేను చెబుతున్నాను. కర్మలో అకర్మని చూడటం అంటే ఏమిటండి పని చేస్తాడండి కానీ నేను కర్తని అనే భావన పెట్టుకోడు. అదేమిటి కర్మలో అకర్మని చూసినట్టు. కర్మలో అకర్మని చూడమంటున్నాడు బానే ఉంది. మళ్ళీ ఏమంటున్నాడు అకర్మలో కర్మని చూడు. అకర్మలో కర్మని చూడటం ఏమిటండి, అకర్మ అంటే అసలు పని లేకుండా కూర్చోవటం. అందులో కర్మని చూడమంటాడు ఏమిటండి, కొంతమంది రమణమహర్షిని అడిగేవారు, ఏవండీ మీరు పని పాటా లేకుండా ఇలా కూర్చుంటున్నారు హాయిగా అని, కానీ ఆయన పని పాటా లేకుండా కూర్చున్నాడా? ఆయన అకర్మలో కర్మని చూస్తున్నాడు. ఏ మనిషి అయితే తన స్వస్వరూపమైన పరబ్రహ్మాని చూస్తున్నాడో, వాడు అకర్మలో కర్మని చూస్తున్నాడు. వాడు దేనిని చూస్తున్నాడు? పరబ్రహ్మాని చూస్తున్నాడు. వాడు కూడా కర్మ చేస్తున్నట్టే అర్థం. అంటే కర్మలో అకర్మని చూడటం అంటే కర్తృత్వం లేకుండా చెయ్యడం, అహంకారం లేకుండా చేయడం. అకర్మలో కర్మని చూడటం అంటే పరబ్రహ్మాని చూసేవాడు, సత్య వస్తువుని చూసేవాడు, నిజాన్ని చూసేవాడు, అకర్మలో కర్మని చూస్తున్నట్టు. అంటే వాడు కూడా పని చేస్తున్నట్టే లెక్క. ఈ విధంగా ఎవడైతే ఉన్నాడో వాడు బుద్ధిమంతుడు, వాడు జ్ఞాని, వాడు యోగి, వాడు భక్తుడు అని చెబుతున్నాడు వాసుదేవస్వామి.

యజ్ఞశ్చ తరువాత యజ్ఞం అంటే మనకి గీతలో అనేక యజ్ఞాలు గురించి చెప్పారు. ద్రవ్య యజ్ఞం, యోగ యజ్ఞం, స్వాధ్యాయ యజ్ఞం, జ్ఞాన యజ్ఞం. అసలు యజ్ఞం అంటే ఏమిటి? స్వాధ్యాయ యజ్ఞం మీరు భగవద్గీతనో, వేదాన్నో, ఉపనిషత్తునో, రోజూ పారాయణ చేస్తూ ఉంటారు అనుకోండి, మీకు అర్థం తెలియదు అనుకోండి మాటవరసకి అనుకోండి

అది కూడా యజ్ఞమే. ఏవండీ జ్ఞాన యజ్ఞం అంటే ఏమిటండి? చదువుతూ ఆ శబ్ధాన్ని మీరు అర్ధం చేసుకోగలిగితే అది జ్ఞాన యజ్ఞం. తరువాత ద్రవ్య యజ్ఞం అంటే ఏమిటండి? దీని విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మీరు ఎదుటి మనిషి నుంచి ఏదో ఒకటి ఆశించో, లేకపోతే తిరిగి ప్రత్యుపకారం మనకి చేస్తారనుకుని చేస్తే అది దానం కాదు. అది ద్రవ్య యజ్ఞం కాదు. మీలో ఏమీ స్వార్ధం లేకుండా మీరు దానం దానం కోసం చేస్తే అది ద్రవ్య యజ్ఞం. ఏవండీ యోగ యజ్ఞం అంటే ఏమిటి? ఇంటిలో హాయిగా కూర్చొని మీరు మనసు నిగ్రహించుకోవడం కూడా యోగ యజ్ఞమే. ఎంత బాగా చెప్పారో చూడండి, ఇందులో ఖర్చు ఏముంది. ఖర్చులేని పనులు చెబుతుంటే ఎవరికీ ఇష్టం ఉండదు. భక్తుల చేత ఎంతసేపు ఖర్చులు చేయించాలి. భక్తుల చేత ఖర్చులు ఎక్కువ చేయిస్తే వాడు పెద్ద గురువు అవుతాడు.

శ్రీ కృష్ణ చైతన్యను చూడటానికి కలకత్తా నుండి భక్తులు వస్తూ ఉంటారు. మీరు చాలా దూరం నుంచి వస్తున్నారు నన్ను చూడటానికి, రైలు చార్జీలు, కారు చార్జీలు చాలా అయిపోతాయి. చాలా దూరం నుంచి వస్తున్నారు నన్ను చూడటానికి అని బాధ పడేవాడు చైతన్యుడు. ఆయన రెండు మాసాలలో శరీరం విడిచి పెడతారు అనగా కొంతమంది చూడటానికి వచ్చారు. చైతన్య వారితో అన్నాడు నా గురించి మీరు చాలా డబ్బులు ఖర్చు పెట్టారు. నేను సంపాదించి మీకు ఇద్దామంటే నేను సన్యాసిని, పోనీ నా శరీరాన్ని ఎవరైనా కొంటారేమో మీరు అమ్మేసుకోండి అన్నాడట. ఏమిభక్తి చూడండి, ఏడ్చారు చూడటానికి వచ్చిన వాళ్ళు, అంటే వారి యొక్క భక్తుల మీద, శిష్యుల మీద వారికి ఎంత ప్రేమో చూడండి కృష్ణచైతన్యకి. వాడు నిజమైన గురువు అంటే మీ చెవి దుద్దులు ఎప్పుడు ఇస్తారు, మీ మెడలో గొలుసు ఎప్పుడు ఇస్తారు అంటే వీడా గురువు? మీ పొలాలు అమ్మేసుకొని రండి అంటే వీళ్ళు గురువులా?


భగవంతుడికి, వాసుదేవుడికి అర్జునుడు బంధువు, శిష్యుడు, స్నేహితుడు. అబద్ధం చెబుతాడా?ఎందుకు ఈ యజ్ఞాలు అన్నీ చెబుతున్నాడు. యోగ యజ్ఞం, ఎంత బాగా చెబుతున్నాడో చూడండి, అసలు ఎవరూ పట్టించుకోరు ఏమిటండి? మీకు కాయ కష్టం లేని పనులే చెబుతున్నాడే! మీరు ఇంటికాడ కూర్చొని, ప్రశాంతంగా, ఏకాంతంగా కూర్చుని, మీ మనస్సుని మీ స్వాధీనంలోకి తెచ్చుకోవటం. మీ మనసుని మీరు నిగ్రహించుకోవటం

కూడా అది కూడా గొప్ప యజ్ఞం తోటి సమానం. మీ మనసు ఏ భోగాలు మీదకి అయితే వెళుతుందో ఆ భోగాలని విడిచి పెట్టడం కూడా యజ్ఞం అంటున్నాడు వాసుదేవ స్వామి, ఎంత బాగా చెబుతున్నాడు చూడండి. ఇందులో ఖర్చు ఏముంది అసలు, ఖర్చు ఏముంది, ఖర్చు లేని పనులు చెబుతుంటే మీకు ఎవరికీ ఇష్టం ఉండదు. ఎంత ఎక్కువ పెద్ద ఫీజు పుచ్చుకుంటే వాడు పెద్ద డాక్టరు అన్నట్టు లెక్క. ఎంతమంచి సలహా చెప్పినా మన దగ్గర రూపాయి పుచ్చుకోడు అనుకోండి చిన్న డాక్టరు ఏమో ఏదో చెక్ చేస్తున్నాడు అనుకుంటాం. మంచి సలహా చెప్పి డబ్బు పుచ్చుకోకపోతే అది నేరమా? యాభై రూపాయలు ఫీజు పుచ్చుకుంటే ఈయన పెద్ద డాక్టరు, లండన్ డాక్టరు. లోకం ఇలా ఉందండి. అందుచేత వేషాన్ని చూసి మనం గౌరవిస్తున్నాం. మాటల యొక్క అడంబరాన్ని చూసి గౌరవిస్తున్నాం. మరి బాహ్యంగా ధనాన్ని చూసి గౌరవిస్తున్నాం. లోపల ఉన్న హృదయాన్ని చూసి గౌరవించడం మనం నేర్చుకోవడం లేదు. లోకం ఇలా ఉందండి.

తప ఆర్జవమ్ తపస్సు అంటే ఏమిటి, నేను అనే తలంపు ఎక్కడ పుడుతుందో చూడు మనస్సు అక్కడే లయిస్తుంది అదే తపస్సు అని రమణ స్వామి గణపతిశాస్త్రి గారికి చెప్పారు. భగవంతుడు కూడా చెప్పాడు తపస్సు గురించి శరీరం తోటి చేసే తపస్సు, వాక్కు తోటి చేసే తపస్సు, మనస్సు తోటి చేసే తపస్సు మూడు రకాల తపస్సులు చెప్పాడు. మీకు ఎవరికైనా దుఃఖం వస్తోంది అనుకోండి, అందరినీ బానే చూస్తున్నాడు నాకే ఈ దుఃఖాన్ని పెట్టాడు అనుకుంటారు. కానీ ఒకటి మటుకి మీరు గుర్తుంచుకోండి భగవంతుడు కాదు ఆ దుఃఖాన్ని మీకు పెడతా, మీరు ఈ జన్మలోనో, పూర్వ జన్మలోనో మీరు చేసిన దోషం ఉంది చూశారు వాక్కు తోటో, శరీరం తోటో, మనస్సు తోటో చేసిన దోషం దుఃఖం కింద లోపల వస్తుంది. భగవంతుడు మీకేమి దుఃఖం ఇవ్వడు. మీ తల్లి తండ్రులే మీకు దుఃఖాన్ని ఇవ్వరు భగవంతుడు ఎందుకు ఇస్తాడు. భగవద్గీతలో ఈ విషయం చెప్పలేదు అని చెప్పటానికి వీలు లేదు. భగవద్గీతలో చెప్పకుండా విడిచి పెట్టిన విషయం ఏదీ లేదండి. జ్ఞానం విలువ చెప్పారు. ఎవరు ఉత్తమ జ్ఞాని, ఎవరు ఉత్తమ యోగి, అని అర్జునుడి తోటి చెప్పాడు. జ్ఞానికి వాడికి వ్యక్తిగతంగా సంతోషం ఉండదు. దుఃఖం ఉండదు. ప్రజల యొక్క సంతోషమే వాడి సంతోషం. ప్రజల యొక్క దుఃఖమే వాడి దుఃఖం. వాడు ఉత్తమ జ్ఞాని. అంటే ప్రజలు దుఃఖ పడుతుంటే వాడికి దుఃఖం వస్తుంది. ప్రజలందరూ సంతోషంగా ఉంటే వాడు సంతోషంగా ఉంటాడు. అంటే

వాడికి సొంత సంతోషం ఉండదు, సొంత దుఃఖం ఉండదు. వాడు ఉత్తమ జ్ఞాని.

రమణస్వామికి కూడా ఎప్పుడైనా కళ్ల వెంట నీళ్లు వచ్చేవి. తెలియని వాళ్లు అనుకునేవారు జ్ఞానికి కూడా కళ్ల వెంట నీళ్లు వస్తున్నాయి అని, అంటే ఆయనకి దుఃఖం లేదు మన దుఃఖమే ఆయన దుఃఖం. వివేకానందకి కూడా ఒకొక్కసారి దుఃఖం వచ్చేది. ఏమండీ మీ బోటి పెద్దలకి కూడా అలా దుఃఖం వస్తుందా అని అడిగేవారు. నేను స్తంభాన్నా, రాయినా, రప్పనా అన్నారట. ఈ స్తంభం ఏడుస్తుందా ఎప్పుడైనా? ఈ స్తంభం ఏమీ ఏడవదు. అయితే జ్ఞానా ఇది?అయితే జ్ఞానికి కూడా ఎప్పుడైనా దుఃఖం వస్తుంది. అది వాడి సొంతం కాదు, వాడి వ్యక్తిగత జీవితం అక్కడ ఏమి ఉండదు. అంటే ప్రజల యొక్క దుఃఖం వాడి దుఃఖం, ప్రజల యొక్క సంతోషం వాడి సంతోషం. వాడే ఉత్తమ జ్ఞాని, వాడే ఉత్తమ యోగి అని భగవంతుడు చెప్పాడు. తపస్సు వాక్కు తోటి చేయటం, మనస్సు తోటి చేయటం, శరీరం తోటి చేయటం. శరీరం తోటి చేసే తపస్సు ఏమిటండి, బ్రహ్మ చర్యమును అవలంభించడం శరీరం తోటి చేసే తపస్సు. ఈ శరీరాన్ని పరుల యొక్క ఉపకారం కోసం, పరుల యొక్క సేవ కోసం ఖర్చు పెట్టడం శరీరంతో చేసే తపస్సు. అయితే వాళ్లు సంతోషించడం లేదండి నేను బాగా సేవ చేస్తున్నాను అంటారు, వాళ్ల గొడవ నీకెందుకు? ఈశ్వరుడు చెయ్యమంటున్నాడు కాబట్టి చెయ్యి. మళ్లీ వాళ్లు ఏమనుకుంటున్నారు, వాళ్లు నన్ను మెచ్చుకుంటున్నారా లేదా వాళ్లు సంతోషిస్తున్నారా లేదా, నాకు కిరీటం పెడతారా లేదా, ఆ గొడవ నీకు అనవసరం. ఈశ్వరుడు చెయ్యమన్నాడు అందుచేత నేను చేస్తున్నాను అనేభావన తోటి నువ్వు చెయ్యి. పని అంటే ఎవడికీ ఇష్టం



**ఒక అమ్మాయి నాన్నగారిని కలవటానికి వచ్చింది. నీకు అమెరికాలో సుఖంగా ఉందా, ఇండియాలో సుఖంగా ఉందా అని నాన్నగారు ఆ అమ్మాయిని అడిగారు. అమెరికాలోనూ సుఖం లేదు, ఇండియాలోనూ సుఖం లేదు, మనస్సు లోపలకు వెళితే సుఖం అక్కడ తెలుస్తోంది అని చెప్పింది. "అమ్మాయి చెప్పిన బ్యూటిఫుల్ రిప్లైకి నాకు ఆశ్చర్యం వేసింది, ఆ అమ్మాయి గురువు అనిపించింది" అన్నారు నాన్నగారు.**

ఉండదు, ప్రతీ వాడికి leisure కావాలి, pleasure కావాలి. Whom I call Mahatma? ఎవడైతే తోటి మానవుల కోసం తన శరీరాన్ని ఖర్చు పెడుతున్నాడో వాడే మహాత్ముడు మిగతా వాళ్ళు అందరూ దురాత్ములు అన్నాడు స్వామి వివేకానంద. మీకు ఆరోగ్యంగా ఉంటే శరీరాన్ని ఎప్పుడూ దాచుకోకండి. అయితే ఈ మనుషులు సంతోషిస్తున్నారా, ఈ లోకం సంతోషిస్తోందా అని మీరు ఎందుకు చూస్తారు. ఈ లోకాన్ని సృష్టించిన పరబ్రహ్మ సంతోషిస్తుంటే ఈ లోకం గొడవ మీకు ఎందుకు. మనం మంద బుద్ధులం కాబట్టి కనిపించేదే నిజం అనుకుంటాం కానీ ఏది కనిపించదో అది లేదు అనుకుంటాం. మన బుద్ధి అటువంటిది. కొంతమంది నలుగురిలో ఉండగా సేవ చేస్తారు. ఒంటరిగా ఉన్నప్పుడు చేయరు. అంటే వాళ్ళకి మెప్పు రాదేమో అని, మీకు ఈ జనం గొడవ ఎందుకు? లోకాన్ని సృష్టించిన పరబ్రహ్మ సంతోషిస్తుంటే ఈ లోకం గొడవ మీకు ఎందుకండీ.

తరువాత మనసు తోటి చేసే తపస్సు. Let Noble Thoughts come to us from every side. ఎటు చూసినా, ఏ మూల నుంచి చూసినా, ఏ దిక్కు నుంచి చూసినా మన మనసులోకి పవిత్రమైన భావాలే రావాలి. మనస్సుతో చేసే తపస్సు ఏమిటంటే, నాకు ఈ కోరికలు ఉన్నాయి. ఈ కోరికలు ఉంటే చెడ్డ అని భగవంతుడు చెబుతున్నాడు. భగవంతుడు చెబుతున్నాడు కాబట్టి నాకున్న కోరికలు నేను విడిచి పెట్టేస్తాను. భగవంతుడు ఏదైతే నన్ను అభివృద్ధి చేసుకోమంటున్నాడో అదే అభివృద్ధి చేసుకుంటాను అనే కోరిక నీలో పుట్టిందో అది మనస్సు తోటి చేసే తపస్సు. శాస్త్రాన్ని వినమన్నాడు. మీరు వినండి. అది మనస్సు తోటి చేసే తపస్సు. మీరు మననం చెయ్యండి. భగవంతుడి రూపాన్ని కృష్ణుడినో, రాముడినో, శివుడినో ఒక రూపాన్ని తీసుకోండి. ఒక నామాన్ని తీసుకోండి ఆ నామాన్ని మీరు మననం చెయ్యండి జపించండి అది మనస్సు తోటి చేసే తపస్సు. తపస్సు అంటే తపించడం. వాక్కు తోటి చేసే తపస్సు ఏమిటి? మనం ఎలా ఉన్నాం అంటే, ఏ మరమరాలో ఒక ప్లేట్ లో పెట్టి ఆ మధ్యన పెడితే వాడు తినేస్తాడేమో, వీడు తినేస్తాడేమో అని గబా గబా తినేస్తాం. మీరు దూడలకి పచ్చ గడ్డి వెయ్యండి. ఒక దూడని ఒకటి పొడుచుకుని గబగబా తినేస్తూ ఉంటాయి. ఆ దూడకంటే ముందు ఈ దూడ తినేస్తుంది, ఈ దూడ కంటే ముందు ఆ దూడ తినేస్తుంది. అందుచేత మనుషులు కూడా పశువులే. ఇలా అంటున్నాను అని ఏమి అనుకోవద్దు మీరు. పశువులు అని ఎందుకు అంటున్నాం అంటే ఈశ్వరుడికి పశుపతి

అని పేరు, ఈ జీవులు అందరూ పశువులు. అంటే ఏమిటి జ్ఞానం తెలుసుకున్నప్పుడు పశుత్వం పోతుంది. అజ్ఞానం ఉన్నంత కాలం పశువులం. దేహాన్ని నేను అనుకునే బుద్ధి ఎంతకాలం అయితే ఉందో ఆ జీవుడు పశువే.

స్వామి వివేకానంద ఏమని చెప్పాడు అంటే నాకు మోక్షం ఎందుకయ్యా, నాకు మోక్షం వద్దు ఏమి వద్దు. చివరికి అందరూ మోక్షానికి వెళ్ళిపోయిన తరువాత ఒక కుక్క మోక్షానికి వెళ్ళకుండా ఆగిపోయింది అనుకోండి. ఆ కుక్కకు మోక్షం ఇవ్వడం కోసం ఈశ్వరుడు నన్ను పుట్టిస్తే మళ్ళీ పుడతాను అన్నాడు. అది మానవ జాతి మీద ఉన్న ప్రేమ. భౌతికానికి, ఆధ్యాత్మికానికి తేడా చూడలేము మనం, తపస్సు శరీరం తోటి చేసే తపస్సు, మనస్సు తోటి చేసే తపస్సు, వాక్కు తోటి చేసే తపస్సు. కానీ మనిషి మనస్తత్వం ఎలా ఉంటుంది అంటే సర్వసాధారణంగా గృహస్థాశ్రమంలో ఉన్నవాళ్ళు మాటలు చెబుతారు కానీ చేతల తోటి చెయ్యలేరు. మాటలు చెబుతారు, ఆచరించలేకపోతారు. ఎక్కడో జబ్బు ఉందండి. మందు మింగుతున్నాం, రోగం తగ్గటం లేదు. అంటే ఆ రోగానికి తగిన మందు మనం వేసుకోవటం లేదన్నమాట. లేకపోతే ఎందుకు తగ్గదు? ఈ జబ్బు ఎక్కడ ఉంది అంటే, మనం ఏ మాట అయితే నోటి తోటి చెబుతున్నామో ఆ మాట మీద మన హృదయంలో విశ్వాసం లేదు.

ఆర్జవమ్ అంటే straightforwardness. అంటే ఋజుత్వం. లౌకికులు ఏమనుకుంటారో చెప్పమంటారా. వీళ్ళకేమీ సంపాదనలేదు, పాడూ లేదు ఇటువంటి దేవుడి గొడవలు చెప్పుకుంటూ టైము ఖర్చు పెట్టేస్తున్నారు ఇలా అనుకుంటారు లౌకికులు, మన ఎదురుగా అనరు చాటుగా అనుకుంటారు. కాని భక్తుడు ఏమి చేస్తున్నాడు అంటే తనకి ఏది శ్రేయస్సో అది చూసుకుంటున్నాడు. వాడంతపాడైపోవటంలేదండి వీడు. భక్తుడు తనకి ఏది శ్రేయస్సో అది చూసుకుంటున్నాడు. భక్తుడు పాడైపోతాడు అని ఎవడైతే అనుకుంటున్నాడో వాడే పాడైపోతాడు చివరికి. ఎందుచేత వాడి శ్రేయస్సు వాడు చూసుకోవటం లేదు. వాడి శ్రేయస్సు వాడు వదిలేసి మనం పాడైపోతున్నాం అని వాడు అనుకుంటున్నాడు. భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నా భక్తుడు నశించడు అని, ఆయన హామీ ఇస్తున్నాడు మనకి, ఇంక దేనికి కంగారు? నా భక్తుడు ఎవడు నశించడు అని చెబుతున్నాడు. ఈ లోపల మనం తొందర పడడం ఎందుకు, మనం తొందర పడవలసిన పని లేదు.

అహింస అంటే ఏమిటి, హింస చేయకూడదు. హింస చెయ్యకూడదు అంటే ఎవరికీ మనం అపకారం చెయ్యకూడదు. భారతంలో అదే చెప్పాడు. ఎదుటివాడికి ఎవడికి నువ్వు అపకారం చెయ్యకుండా జీవించు అన్నాడు. అయితే ఎదుటివాడికి మనం అపకారం చెయ్యం అది రైటే. నేను చెప్పేది ఏమిటంటే, ప్రతీ మనిషి కూడా తనని తాను హింసించు కుంటున్నాడు. మిమ్మల్ని మీరు హింసించుకోకుండా మీకు దుఃఖం ఎందుకు వస్తుంది. మీ మనసుని, ఈ జీవుడిని మీరు బాగా హింస పెట్టేసుకుంటున్నారు. హింస పెట్టుకోవడానికి కారణం ఏమిటి? మీలో ఉన్న నిజం మీకు తెలియక మీరు జీవుడిని హింస పెడుతున్నారు. మీలో ఉన్న నిజం కనుక మీకు తెలిస్తే ఈజీవుడు బాధపడడు, దుఃఖ పడడు. మీలో ఉన్న జీవుడి స్వరూపం, మీకు తెలిస్తే ఈ జీవుడికి దుఃఖం రాదు. మిమ్మల్ని మీరు హింస పెట్టుకోవడం అంటే ఏమిటి అంటే మీ భావాలు తోటి, మీ ఊహాలు తోటి, మీ తలంపులు తోటి, మీ ఆదర్శాల తోటి, మీ ఆశయాల తోటి, మీ ఆకాంక్షల తోటి, మీ అదృష్టం తోటి, వీటితో కలిసిపోయి ఇవన్నీ పోగు చేసుకుని దుఃఖాన్ని తీసుకొచ్చి మనసు బాధ పెట్టేస్తుంది. ఏ ప్రాణికి ఆ ప్రాణి మనసుని హింస పెట్టేసుకుంటారు. కొంతమంది బెంగ పెట్టుకుని, బెంగ పెట్టుకుని చిక్కిపోతూ ఉంటారు. ఏ విషయం గురించి అయినా లోపల ఎక్కువ బెంగ ఉంటే అది కూడా జీవుడిని హింస పెట్టుకోవడమే పాపం. అస్తమాను బెంగ పెట్టుకునేవాడు ఈ లోకంలో నాలుగు రూపాయలు సంపాదించుకోలేడు. పోనీ పరలోకంలోకి వెళ్ళిన తరువాత ఏ మోక్షాన్నో, వైకుంఠాన్నో, కైలాసాన్నో పొందుతారు అంటే బెంగతో వీడు సాధన ఏమి చేస్తాడు? బెంగ పెట్టుకుని అలా మనస్సుతోటి కృశించిపోయి వాళ్ళు ఈశ్వరుణ్ణి స్మరించరు, వాళ్ళు ఈ లోకంలో సుఖపడరు. పోనీ ఈ బెంగ పెట్టుకోవడం వలన పరలోకంలో వాళ్లకి ఏమైనా సుఖం ఉంటుందా అంటే పరలోకంలో సుఖం ఉండదు.

ధనం మీద ఆశ ఉన్నవాళ్ళు, ఆ కొత్త కాగితాలని చూస్తే ఊరుతూ ఉంటారు. కొంతమందికి జున్ను అంటే ఇష్టం అనుకోండి ఆ జున్నుతపాలాకేసి చూస్తే ఊరుతూ ఉంటారు. పదవి వస్తుంది అంటే వీడి దగ్గర ఉన్న డబ్బు అంతా ఖర్చు పెట్టేస్తాడు ఒకడు. ఎందుచేత ఆ పదవి మీద ఉండే ప్రీతి కొలది. ఇవన్నీ కూడా అజ్ఞానం యొక్క చేష్టలు. ఇందులో ఇంకొక రహస్యం ఉంది. మీరు ఫలితాన్ని ఆశించకుండా పని చేస్తూ ఉంటే ఆ ఫలితం రాకపోయినా పని చేశాం అనే సంతృప్తి అయినా మిగులుతుంది అని చెప్పారు.

జీవితాన్ని శోధించాలి, పరిశోధించాలి. జీవితం అంటే ఏమిటండి, శరీరంలో ఉన్నంతసేపు జీవితం అనుకోకండి. జీవుడు ఎవడూ మారడు, శరీరం మారుతుంది. నేను రెండు కార్లు మారాను. జిన్నూరు నుంచి పాలకొల్లు వరకు ఒక కారు, పాలకొల్లు నుండి అరట్లకట్ట వరకు ఒక కారు. రెండు కార్లు మారాను. నా శరీరం మారలేదు కార్లు రెండు మారాను. అదే విధంగా జీవుడు కూడా శరీరాలు మారుస్తాడు కానీ ఆ జీవుడు మారడు. నేను మద్రాసులో పుడితే మద్రాసులో ఉన్నాను అనుకుంటాను శరీరం అక్కడ ఉంది కాబట్టి, శరీరాన్ని నేను అనుకుంటున్నారు కదా, మీరు స్త్రీ శరీరంలో పుడితే స్త్రీ అనుకుంటారు. పురుషుడు శరీరంలో పుడితే పురుషుడు అనుకుంటారు. శరీరానికి స్త్రీ అని, పురుషుడు అని బేధం ఉంది కాని జీవుడికి స్త్రీ అని, పురుషుడు అని బేధం లేదు. అయితే భగవంతుడు ఏమని చెబుతున్నాడు అంటే నువ్వు నా అంశరా, నువ్వు నాలో వచ్చి కలవమని చెబుతుంటే నేను ప్రపంచంలో కలుస్తాను అంటున్నావు నువ్వు.

సత్యం. ఈ లోకంలో సత్యంతో సమానమైనది ఏమీ లేదు. ఇంక దానిని మించినది ఎలా ఉంటుంది. సత్యానికంటే గొప్ప మతం లేదు. హిందూ మతం కానీ, క్రైస్తవ మతం కానీ, మహమ్మదీయ మతం కానీ, ఏ మతం కూడా సత్యానికంటే గొప్పది ఏది కాదు. పూర్వం ఎవరికీ తెలియదు ఇవన్నీ నేనే కనిపెట్టాను అని కొంతమంది చెపుతూ ఉంటారు. ఇవన్నీ దొంగ మాటలు. ఈ మాట నమ్మకండి, ఎందుచేత? ఇవన్నీ మిమ్మల్ని మోసం చేసే మాటలు. ఒక్క విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీ తెలివిని కానీ, మీ ప్రతిభని కానీ, విడిచి పెట్టద్దు. మీ తెలివిని విడిచి పెట్టేశారా, మీ ప్రతిభని విడిచి పెట్టేశారా అప్పుడు ఏది మంచి, ఏది చెడ్డ మీకు తెలియదు. మీకు కనుక తెలివి ఉంటే ఏది మంచిదో

**రాగద్వేషాలు తగ్గించుకుంటే, హింసా విధానం తగ్గించుకుంటే మీ మనస్సు మీకు తెలియకుండా ఆత్మ ఆకారం చెందుతుంది.**



తెలుస్తూ ఉంటుంది. ఏది చెడ్డదో తెలుస్తూ ఉంటుంది. ఏది సత్యమో తెలుస్తుంది, ఏది అసత్యమో తెలుస్తుంది. అందుచేత మీరు తెలివిని ఎప్పుడూ విడిచి పెట్టద్దు. తెలివి విడిచి పెట్టేస్తే మనం పశువు తోటి సమానం. బుద్ధి లేనివాళ్ళం అయ్యిపోతాం. స్వామి ఏమి చెబుతున్నాడు అంటే శరీరం కంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియములు కంటే మనస్సు గొప్పది. మనస్సు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే ఆత్మ గొప్పది. ఆత్మ గొప్పది అంటే ఏమిటి ఆత్మని తెలుసుకున్నవాడు జ్ఞాని అవుతున్నాడు కాబట్టి. బుద్ధి విడిచి పెట్టకూడదు. జ్ఞానాన్ని విడిచి పెట్టకూడదు. బుద్ధిని పవిత్రం చేసుకోవాలి. బుద్ధిలో వంకరలు ఉండకూడదు. బుద్ధి నిదానంగా ఉంచుకోవాలి. ధనం అవసరమే, ధనం ఎంతవరకు అవసరం? మీ దేహాన్ని నిలబెట్టుకోవడం కోసం, మీ శ్రేయస్సు కోసం, మీ కుటుంబ శ్రేయస్సు కోసం, సమాజ శ్రేయస్సు కోసం ధనాన్ని ఖర్చు పెట్టు. అందుచేత ధనం అవసరమే కానీ దానిని ఉపయోగించుకోవడం తెలిసి ఉండాలి. దానిని ఉపయోగించుకోవడం నీకు తెలియకపోతే నీ నాశనం అది కోరుతుంది. నికృష్టమైన జన్మలు వస్తాయి.

జీవుడు స్వతంత్రుడు కాదు, జీవుడు అస్వతంత్రుడు. జీవితంలో ఒక లక్ష్యం ఉండాలి. లక్ష్యం లేని జీవితం పనికిరాదు. ఎవడికైతే జీవితంలో లక్ష్యం లేదో వాడు తప్పనిసరిగా తప్పులు చేస్తాడు. మన జీవితాలు ఎలా ఉన్నాయి అంటే వెనక ఎవడో పుస్తకంరాసి ఒక పండితుడికి చూపించాడు. ఆయన అలా అలా చూస్తున్నాడు. ఏవండీ అందులో ఎక్కడైనా తప్పులు ఉన్నాయా అన్నాడట రాసినవాడు. తప్పులు కాదయ్యా ఒప్పులు ఎక్కడైనా కనిపిస్తాయేమో అని చూస్తున్నాను అన్నాడట. అంటే అందులో అన్నీ తప్పులే.

మనం ఎంతసేపు లోకుల తోటే స్నేహం చేస్తున్నాం కాబట్టి ఈ లోకం అబద్ధం అయినప్పటికీ నిజం కిందే మనకి కనిపిస్తుంది. ఇంకొక చిన్న రహస్యం ఉంది ఇక్కడ, మన కళ్ళకి కనిపిస్తున్న ప్రపంచం ఎంతకాలం అయితే మనకి నిజంగా కనిపిస్తుందో, అంతకాలం మన మనస్సు ఎంత ప్రయత్నం చేసినా లోపలకు వెళ్ళదు బయటకి వచ్చేస్తూ ఉంటుంది. ఒకసారి రమణ స్వామి గారిని ఎవరో అడిగారు, ఏవండీ నా మనసు కుదురుగా లేదు, నిలబడడం లేదు అని, అప్పుడు భగవాన్ అన్నారు మీ మనస్సు నిలబడడం లేదు, అస్తమాను కదులుతోంది అంటున్నారు. నా మనస్సునేమో కదలమంటే కదలడం లేదు

అన్నారట. అంటే దాని అర్థం ఈ ప్రపంచం మీకు నిజంగా కనిపిస్తున్నంత కాలం మీరు ఎంత సాధన చేస్తున్నా అది బయటకి అలా పోతూ ఉంటుంది.

ఇక్కడ ఏమని చెబుతున్నారు అంటే స్వామి, అహింస, సత్యం, అక్రోధం. క్రోధం లేకుండా ఉండండి. క్రోధం లేకుండా ఉండమన్నాడు ఇప్పుడు మనం అందరం క్రోధం లేకుండానే ఉన్నాం కదండీ. అయితే అందరం మనమందరం పెద్ద మనుషులమేనా, ఈ క్రోధం ఇప్పుడు రాదండి. మనకి ఎవరైనా అపకారం చేస్తే అప్పుడు వస్తుంది. మనకి ఎవడైనా కొంచెం అపకారం చేశాడు అనుకోండి అప్పుడు కోపం వచ్చేస్తుంది. మనలని ఎవడైనా విమర్శించాడు అనుకోండి అప్పుడు కోపం వస్తుంది. అంటే ఏమిటి ఎవరైనా విమర్శించినా నిన్ను, ఎవడైనా నీకు అపకారం చేసినా, ఎవడైనా నిన్ను నష్ట పెట్టినా, అప్పుడు నీ మనసులో వికారం పుట్టకుండా ఉంటే అది అక్రోధం. అంటే క్రోధం లేకుండా ఉండటం అంటే అది. ఎదుటివాడు మనల్ని హింసించినప్పటికీ మన మనసులో వికారం పుట్టకుండా ఉంటే అది అక్రోధం.

శాస్త్రాలను బాగా పరిశీలిస్తే పెద్దలకు సేవ చేస్తే జ్ఞానం కలుగుతుంది అని చెప్పారు. నువ్వు పుట్టిన ఊరిలో కనుక సత్పురుషులు లేకపోతే ఆ ఊరిని ఖాళీ చేసి బయటకి పొమ్మన్నారు శంకరాచార్యుల వారు. ఆ మందలో కలిసిపోవడం కంటే ఆ ఊరిని ఖాళీ చేసేయమన్నాడు. పోనీ పడితే ఆజన్మకే బాధలు పడతావు. ఈ జనంతో కలిస్తే కోట్లాది జన్మలు నరకంలో పడవలసిందే!

త్యాగం అంటే ఏమిటి అంటే భోగాలని విడిచి పెట్టడమే త్యాగం, భోగ జీవితాన్ని విడిచి పెట్టటమే త్యాగం. భోగి తప్పనిసరిగా రోగి అవుతాడు ఎప్పుడూ కూడా, మీకు డబ్బు ఉంది కదా అని భోగాలు అనుభవించడం ప్రారంభిస్తే ఎప్పటికైనా మీరు రోగి అవుతారు, భోగం ఏమితీసుకు వస్తుంది, రోగాన్ని తీసుకు వస్తుంది. గౌతమ బుద్ధుడు అన్నాడు మూడు పూటలా తినేవాడు రోగి. రెండు పూటలు తినేవాడు భోగి. ఒక పూట తినేవాడు యోగి. త్యాగం అంటే ఏమిటండి? నీలో లోకానికి సంబంధించిన ఇష్టాలు ఏవైతే ఉన్నాయో ఆ ఇష్టాలను విడిచి పెట్టడమే త్యాగం. అంటే నీకు ఏదైతే ప్రియమో, నీకు ఏదైతే భోగమో దానిని విడిచి పెట్టడమే త్యాగం. అందుచేత కాశీ వెళ్ళినప్పుడు మీకు ఇష్టమైన వస్తువు విడిచి పెట్టమంటారు. వీళ్ళు ఏమి చేస్తారండి ఇష్టం లేని కాకరకాయ విడిచి పెడతారు.

ఇష్టమైన వస్తువు విడిచి పెట్టాలి అన్నారు కాశీలో, వీళ్ళు ఏమి చేస్తారు ఇష్టం లేని వస్తువు విడిచి పెట్టేస్తారు. అది ఎలాగా తినం కదా మనం. మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి మీరు ఏ వ్యక్తి దగ్గరకి వెళ్లి కూర్చుంటే మీ మనసుకి శాంతిగా ఉంటుందో, వాడు నిజమైనటు వంటి యోగి. మీ మనసు ఎంత గొడవగా ఉండనివ్వండి, ఎవరైనా ఒకడి దగ్గరకి వెళ్లి కూర్చొంటే, ఆ మనిషి దగ్గర కూర్చున్నప్పుడు మీకు శాంతి వస్తే, ఆ మనిషిలో ఏదో విశేషం ఉన్నట్టే! నాలో శాంతి ఉంటే మీకు అందరికీ నేను శాంతి పంచి పెట్టగలను. నాలో శాంతి లేనప్పుడు మీకు ఏమి ఇవ్వగలను? శాంతి అనేది హృదయానికి సంబంధించినది. ఎప్పుడూ కూడా మనస్సులో భక్తి ఉండాలి, హృదయంలో జ్ఞానం ఉండాలి. శరీరంతోటి పని చెయ్యాలి, మనస్సులో భక్తి ఉండాలి, హృదయంలో జ్ఞానం ఉండాలి. ఈ రకంగా ఉంటే వాడు సమగ్రంగా balanced గా నడుస్తాడు. విషయాలని స్మరించినంత కాలం మీకు శాంతి రాదు భగవంతుడిని స్మరిస్తే శాంతి వస్తుంది. మనం ఏమి చేస్తున్నాం, విషయాలని స్మరిస్తున్నాం, భోగాలని స్మరిస్తున్నాం. లోకాన్ని స్మరిస్తున్నాం, శాంతి రావాలని కోరుకుంటున్నాం. ఇలా అయితే శాంతి రాదు, అశాంతి వస్తుంది. లోకంలో ఉన్నది అశాంతే, శాంతి ఎక్కడ ఉంది? ఈశ్వరుడి దగ్గర ఉంది. రమణస్వామి దగ్గరకి వెళ్లి అలా ప్రశాంతంగా కూర్చుంటే ఆయనని అడుగుదాము అనుకున్న ప్రశ్నలు కూడా మర్చిపోయారట, పెద్ద పులి వచ్చినా సరే దాని కోపం కూడా పోయేది అట. వెనక ఒక ఊర్లో పెద్దపులి వస్తే షావుకారు గారు అన్నారటండి నేను కింద పడుకుంటాను. మీరు అందరూ పైన పడుకోండి అన్నారట. ఈ షావుకారు ఉద్దేశ్యం ఏమిటి అంటే ఈ పైన వాళ్ళని తినేస్తుంది ఈయనకి ఫరవాలేదు అని. ఇప్పుడు రమణ స్వామి దగ్గరకి పులి వచ్చింది అనుకోండి ఆయన రండి దయచేయండి కూర్చోండి అనేవారు. ఆయన తమ్ముడు ఆశ్రమం మీద పెత్తనం చేసేవాడు. ఒకసారి పులిని చూసి ఈయన కంగారు పడి పరుగెట్టుకుంటూ వస్తున్నాడు. అది స్వామి చూశారు. పులి దగ్గరకి వెళ్ళి రమణస్వామి ఏవయ్యా ఆయన ఈ ఆశ్రమానికి అధికారి అని నీకు తెలియదా అన్నారట. జ్ఞానికి అంతటా ఉన్నది ఒక్కటే ఆత్మ. తనలో ఉన్న వస్తువునే పులిలోనూ చూస్తాడు, పాములోనూ చూస్తాడు, గోవులో చూస్తాడు. అన్నిటిలోనూ తనలోని వస్తువునే చూస్తాడు. తనకంటే భిన్నంగా జ్ఞానికి ఏ వస్తువు కనపడదు. The sage is bodyless, mindless and worldless. జ్ఞానికి దేహం లేదు, మనసు లేదు, ప్రపంచం లేదు. తనకంటే వేరుగా ఒక వస్తువు కనిపిస్తే

వాడికి భయం పుడుతుంది. తనకంటే వేరుగా వస్తువు కనపడనప్పుడు తనకి భయం ఏమి ఉంటుంది. నన్ను నేను చూసుకుని ఎప్పుడైనా భయపడతానా? ఎవరు పుట్టారు అంటే నేను పుట్టాను నేను పుట్టాను అంటారు వీడు పుట్టాడేంటి వీడి శరీరం పుట్టింది. పిల్లలు మనకి పుట్టారు అనుకుంటున్నారు కానీ ఆ శరీరాలు మీ పిల్లలు కాని లోపల ఉన్న జీవుడు మీ వాడు కాదు. వాళ్ళు ఎక్కడ నుంచో వచ్చి మీ ఇంట్లో పడ్డారు. ఆ జీవుడిని మీరు ఇవ్వలేదు, శరీరాన్ని ఇచ్చారు. అయితే జీవుడు ఎలా వచ్చాడు, వాడి కర్మని బట్టి వాడు వచ్చాడు. ఆ జీవుడు కర్మని బట్టి వాడికొక శరీరం కావాలి కాబట్టి మీ కడుపులో వాడు శరీరం తయారు చేసుకొన్నాడు. అందుచేత ఒకే తల్లి కడుపున నలుగురు పుడితే నలుగురు నాలుగు రకాలుగా ఉంటారు చూడండి.

అందరిలోనూ ఈశ్వరుడు సమానంగా ఉన్నాడు. అందరినీ నేను తిప్పుతున్నాను అని ఈశ్వరుడు చెబుతున్నాడు. మనస్సు ఏమో శరీరాన్ని తిప్పుతుంది. మనసుని నేను తిప్పుతున్నాను అన్నాడు. అంటే ఏమిటి చేసిన కర్మని బట్టి ఏ కాలంలో, ఏ దేశంలో, ఏ జన్మలో వీడికి ఏ బుద్ధి పుట్టించాలో ఆ బుద్ధిని లోపల ఉండి వీడి కర్మని బట్టి బుద్ధిని పుట్టిస్తాడు. ఆ బుద్ధిని పుట్టించేవాడు ఈశ్వరుడే. భోగం అనుభవించవలసిన యోగం మీకు ఉంటే సరిగ్గా ఆ టైము వచ్చేటప్పటికి మీకు ఆ బుద్ధిని ఈశ్వరుడు లోపల పుట్టిస్తాడు. అంటే మీ కర్మని బట్టి ఆ బుద్ధిని మీకు ఈశ్వరుడు పుట్టిస్తున్నాడు కానీ అందులో మీ ఇష్టం లేదు, అయిష్టం లేదు. పరమేశ్వరుడు యొక్క పాదాలని ఎప్పుడూ కూడా విడిచి పెట్టద్దు. మీరు ప్రయత్నం చెయ్యండి. ప్రయత్నం చెయ్యడం వల్ల మీకు ఫలితం రాకపోవచ్చు. చేసిన ప్రయత్నం మటుకి ఊరికే పోదు. అది జ్ఞాపకం ఉంచుకోండి.



**నీ సాధన నిజమైతే గురువు దగ్గరకు నీవు వెళ్ళనక్కరలేదు. గురువే వచ్చి నీ తలుపు తడతాడు అన్నాడు రామకృష్ణుడు.**

స్వామి వాసుదేవ స్వామి చెప్పే అపైశునమ్ అంటే ఏమిటి? కొండాలు వెతకకుండా ఉండటం. ఎదుటివాడిలో ఉన్న తప్పులు వెతకకుండా ఉండటం. కొంతమంది ఎంతసేపు ఎదుటి వాళ్ళలో ఉన్న తప్పులు వెతుకుతూ ఉంటారు. అంటే రంధ్రాన్వేషణ. ఎదుటి మనిషిలో తప్పులు ఉన్నా కానీ ఆ తప్పులు మనం చెప్పకూడదు. ఒకవేళ తప్పులుంటే వాడే నష్టపోతాడు మీకు ఎందుకండీ మీరు ఎందుకు చెప్పకోవాలి. మన మనసు బహిర్ముఖం అవ్వడం వలన వాడి తప్పులు కనిపిస్తున్నాయి. మన మనసు అంతర్ముఖం అయితే మన తప్పులు కనిపిస్తాయి. అందుచేత నా తప్పులేమిటో తెలుసుకుని పోగొట్టుకుంటే నేను బాగుపడతాను కానీ ఎదుటివాడిలో ఇన్ని తప్పులు ఉన్నాయని రోజూ వెతుకుతుంటే నాకు కలిసి వచ్చేది ఏమిటి? నాకు కలిసి రాదు సరికదా దానివల్ల నాకు కాలం ఖర్చు అవుతుంది. శ్రమ ఖర్చు అవుతుంది. వీడి తప్పులు గురించి నా కాలాన్ని, నా శ్రమని, నా డబ్బుని ఖర్చు పెట్టుకోవాల్సిన పని ఏమిటి? డబ్బు పోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు కానీ బుద్ధి పోతే మళ్ళీ బుద్ధి రాదు. అందుచేత రెండవ అధ్యాయంలో భగవంతుడు చెబుతాడు బుద్ధి నాశనం అయిపోతే ఆ మనిషి పూర్తిగా నాశనం అయ్యిపోయినట్టే అన్నాడు పరమాత్మ.

ఎవడి స్వభావాన్ని వాడు విడిచి పెట్టడు. నేను చెబుతున్నాను కానండి నా స్వభావం నేను విడిచి పెట్టను. మీ స్వభావం మీరు విడిచి పెట్టరు. వెనక ఒక ఋషి స్నానం చేస్తూ ఉంటే ఒక తేలు ప్రవాహంలో కొట్టుకుని వచ్చి వాడిని కుట్టిందట. ఆయన ఏమి చేశాడు తేలుని నీటిలో వదిలేశాడు. అది మళ్ళీ వచ్చి కుట్టిందట. ఈయన మళ్ళీ వదిలేశాడు, అది మళ్ళీ వచ్చి కుట్టిందట. ఈ సాధువు గారు మనకి ఏమీ అపకారం చెయ్యటం లేదు, కుట్టటం ఎందుకు అని అది అనుకోవడం లేదు కుట్టేస్తోంది. ఈయన రక్షిస్తున్నారు, అది కుట్టేస్తోంది. అదేమిటండి అన్ని సార్లు కుడుతోంది దాన్ని చంపేయకుండా రక్షించడానికి ప్రయత్నం చేస్తారు ఏమిటి అని సాధువు గారితో అంటే కుట్టటం అనేది దాని స్వభావం, అది విడిచి పెట్టనప్పుడు రక్షించడం అనేది నా స్వభావం, నేను ఎందుకు విడిచి పెట్టాలి అన్నారట. అందుచేత మీరు ఏమనుకొన్నా చెడ్డవాళ్ళు మంచివాళ్ళు అవ్వడం కష్టం, మంచి వాళ్ళు చెడ్డ వాళ్ళు అవ్వడం కష్టం.

దయా భూతేషు భూతముల పట్ల దయ కలిగి ఉండాలి. మనకి కోరిక ఉంది కాని

దయ లేదు. ఏ హృదయంలో అయితే దయ ఉందో, ఆ హృదయంలోనే భగవంతుడు ఉంటాడు. భగవంతుడు యొక్క నివాసం ఎక్కడ ఉంది? దయ గల హృదయంలోనే భగవంతుడి యొక్క నివాసం ఉంది. మనకి దయ అనేది లేదు అనుకోండి ఆ దయ తెచ్చుకోవాలి మనం నేర్చుకోవాలి.

అలోలత్వం అంటే ఏమిటి విషయాలు కనిపించినప్పటికీ మన మనసుకి వికారం రాకూడదు. అంటే భోగాలు మన ఎదురుగా ఉన్నప్పటికీ మన మనసులో వికారం పుట్టకూడదు. మన చిత్తంలో చలనం రాకూడదు. గుడ్డ ఎలా వచ్చింది? పత్తిని బట్టి. మైసూరు పాకం ఎలా చేస్తారు? శనగపిండి, పంచదార తోటి మైసూరు పాకం చేస్తారు. మనస్సు ఎలా తయారు అయ్యింది అంటే మనం తినే అన్నాన్ని బట్టి మనసు తయారు అయ్యింది. అంటే మనం తినే ఆహారంలో కనుక జాగ్రత్తగా లేకపోతే మైండ్ పాడవుతుంది. రమణస్వామి గారు ఒక మాట చెప్పారు నియమాలు అన్నిటిలోకి ఆహార నియమం ఉత్తమమైనది.

మార్దవం అంటే మృదుత్వం. కొంతమంది కఠినంగా మాట్లాడుతారు, ఒకొక్కళ్ళు మాట్లాడుతూ ఉంటే లడ్డూ నోట్లో వేసుకున్నట్టు స్వీట్‌గా ఉంటుంది. యుక్తంగా మాట్లాడతారు. హితవుగా మాట్లాడతారు. ఎంతవరకు మాట్లాడాలో అంతవరకు మాట్లాడతారు కాని తక్కువ మాట్లాడరు ఎక్కువ మాట్లాడరు.

హ్రీ అంటే సిగ్గు, భగవంతుడు ఏమిటి సిగ్గుపడాలి అని చెబుతున్నాడు. చెడ్డ కార్యాలు చెయ్యటానికి సిగ్గు పడు, చెడ్డ ఆలోచనలు ఆలోచించడానికి సిగ్గు పడు. చెడ్డ విషయాలు చూడటానికి సిగ్గు పడు, చెడ్డ విషయాలు వినడానికి సిగ్గు పడు. చెడ్డ విషయాలు మాట్లాడడానికి సిగ్గు పడు. చెడ్డ చెయ్యడానికి సిగ్గు పడు. మంచి అనుకున్న దానిని చెయ్యడానికి నువ్వేమి సిగ్గు పడక్కర్లేదు. నువ్వేమి పిరికితనం పడక్కర్లేదు అని భగవంతుడు వాసుదేవ స్వామి వారు చెబుతున్నారు. అచాపలమ్ అంటే చపలత్వం లేకుండా ఉండమన్నారు. మీకు పనికొచ్చే పనులు చెయ్యండి, పనికిరాని పనులు మానేయ్యండి. పనికిరాని పనులు చేసేవాళ్ళు ఎవరు అంటే మనసులో చపలత్వం ఉన్నవాళ్ళు చేస్తారు. చపలత్వం ఉన్నవారు ఆత్మ విచారణ చెయ్యమంటే ఆత్మ విచారణ మానేసి, శాస్త్ర విచారణ మానేసి లోక విచారణ చేస్తూ ఉంటారు. అందుచేత చపలత్వం తోటి చేసే పనులు మీరు

మానేయండి. కొంతమంది నడిచి వెళ్ళిపోతారు కానీ దిక్కులు చూడరు. మనసులో చపలత్వం ఉన్నవాళ్ళు దిక్కులు ఎక్కువ చూస్తారు. మీరు అసలు ఏ ఇంద్రియం కూడా కదపద్దు. అవసరమైనప్పుడు ఆ ఇంద్రియాలను ఉపయోగించుకోండి. అవసరం లేనప్పుడు దానిని ఉపయోగించకండి.

తేజఃతేజస్సు, ప్రకాశం, intelligence. ఒక మనిషి గొప్ప గొప్ప పనులు చేస్తున్నాడు అంటే ప్రతిభ దానికి కారణం, ఇప్పుడు చదువు పెరుగుతోంది కానీ, చదువుతో పాటు intelligence పెరగడం లేదు. ఒక ఇంగ్లీషు రచయిత ఏమన్నాడు అంటే తెలిసి ఉన్నవాళ్ళు ఎవరూ మాట్లాడరు, మాట్లాడే వాళ్లకి ఏమీ తెలియదు. రమణస్వామి లాగా మౌనంగా ఉండి మీకు శక్తిని ఇవ్వలేం కాబట్టి మేము మాటలు చెప్పవలసి వస్తోంది. నా హృదయం కనుక పరమ పవిత్రం అయితే నా మాటల తోటి పని లేకుండా ఆ శక్తి మీ అందరి మీద పని చేస్తుంది. భౌతికంగా, ఆధ్యాత్మికంగా మీరు అందరూ అభివృద్ధిలోకి వెళ్ళాలి అని నేను హృదయపూర్వకంగా మీకోసం తపస్సు చేస్తే మీరు అందరూ బాగుపడతారు. అంటే మాటల్లో ఏమీ లేదు సౌందర్యం అంతా హృదయంలో ఉంది.

క్షమా అంటే ఓర్పు. ఒక మనిషి యొక్క గొప్పతనం ఓర్పుని బట్టి చెప్పాలి. ఓర్పు ఎంత గొప్పది అంటే ఓర్పు వల్ల పూర్వపు జన్మల్లో వీడు చేసిన కర్మలకి సంబంధించిన దోషాలు ఉంటే ఆ దోషాలు కూడా క్షయం అయిపోతాయి.

ధృతి అంటేధైర్యం. భారతంలో భీష్ముడు ఏమని చెప్పాడు అంటే అన్ని సమస్యలకి, అన్ని రోగాలకి మందు ధైర్యంఅన్నాడు. అందుచేత ధైర్యాన్ని విడిచి పెట్టద్దు. షేక్స్పియర్ చెబుతాడు ఒక డ్రామాలో, ధైర్యం ఉన్నవాడు జీవితంలో ఒక్కసారి చచ్చిపోతాడు, ధైర్యం లేనివాడు రోజుకి ఒకసారి చచ్చిపోతాడు అని చెప్పాడు. అందుచేత మనం ధైర్యాన్ని విడిచి పెట్టకూడదు. ధైర్యం అనేది హృదయానికి సంబంధించినది. ధైర్యం కనుక ఉంటే మీకు అన్ని సద్గుణాలు ఉన్నట్టే. సముద్రానికి ఎంత లోతు ఉందో ధైర్యం ఉన్నవాడికి హృదయంలో అంత లోతు ఉంటుంది అన్నాడు.

శ్శుచి అంటే భగవంతుడు ఏమిచెబుతున్నాడు అంటే మీరు శరీరం శుభ్రంగా ఉండటం కోసం రోజూ స్నానం చేస్తున్నారు, మంచిదే స్నానం చెయ్యండి. మీ శరీరం లోపల

మనస్సు ఉంది కదా, ఆ మనస్సు శుభ్రం చెయ్యడం కోసం దేనిని పెట్టి కడుగుతున్నారు, అది కూడా శుభ్రంగా ఉండాలి కదా, లోపల బయట కూడా శుభ్రంగా ఉండాలి. పరిశుద్ధంగా ఉండాలి. భగవంతుడు ఎంత బాగా చెబుతున్నాడో చూడండి మిమ్మల్ని మురికిగా ఉండమని చెప్పటం లేదు. మీ శరీరం శుభ్రంగా ఉండాలి, మీ ఇల్లు శుభ్రంగా ఉండాలి, మీరు తినే కంచాలు శుభ్రంగా ఉండాలి. మీరు వండుకునే పాత్రలు శుభ్రంగా ఉండాలి. మీ పరిసరాలు శుభ్రంగా ఉండాలి. అన్నీ శుభ్రంగా ఉండాలి రైటే. కానీ బాహ్యంగా ఉన్నటువంటి environment ఎంత శుభ్రంగా మీరు చూస్తున్నారో, మీ మనస్సు కూడా అంతే శుభ్రంగా ఉండాలి. అయితే మీ శరీరాన్ని శుద్ధి కోసం నీళ్ళు పెట్టి కడిగేసుకుంటున్నారు. కానీ మీ మనస్సు శుద్ధి కోసం మీరు ఏమి చేస్తున్నారు? మనసు బాగుపడాలి కదా, మీరేమన్నా శాస్త్రాన్ని వింటున్నారా? పెద్దలని ఏమైనా సేవిస్తున్నారా? భగవంతుడిని స్మరిస్తున్నారా? మీరు భగవంతుడిని స్మరించగా, స్మరించగా మీ మనస్సుకి పరిశుద్ధత ఏర్పడుతుంది. ఇక్కడ స్వామి ఏమి చెబుతున్నాడు అంటే లోకాన్ని స్మరిస్తూ ఉంటే నీ మనస్సు అపవిత్రం అయ్యిపోతూ ఉంటుంది. భగవంతుడిని స్మరిస్తూ ఉంటే నీ మనస్సు పవిత్రం అవుతూ ఉంటుంది. అందుచేత నీ అంతఃకరణం, శుభ్రంగా ఉండాలి కాబట్టి ఎంతసేపు భగవంతుడి యొక్క స్మరణ చెయ్యి. అలా చెయ్యడం ఒకవేళ నీకు ఇష్టం లేదు అనుకో, నీ లోపలే నేను ఆత్మగా ఉన్నాను కాబట్టి నీ మనస్సుని లోపలకి తిప్పి ఆత్మను స్మరించు. ఆత్మని ధ్యానం చెయ్యి, అలా చెయ్యడం వల్ల కూడా మనసు పవిత్రం అవుతుంది. మీకు అర్థం అయ్యిందా మీరు వంద సంవత్సరాలు జీవించారా, నూట ఇరవై సంవత్సరాలు జీవించారా భగవంతుడికి అక్కర్లేదు. మీరు ఇరవై సంవత్సరాలు జీవించినా ఎలా జీవించారు అనేది కావాలి. మీరు తాటాకు



**ఎదుటివాళ్ళు మన గురించి చెప్పుకోవాలి అని కానీ, మనకు కీర్తి రావాలి అని కానీ, మనకు గొప్పలు రావాలి అని కానీ, ఇటువంటి మాటలు వదిలేసి, మీరు మామూలుగా చేసే పనులు ఈశ్వరుడి ప్రీతికోసం చేస్తే ఈ లోకంలో ఉండగానే, ఈ శరీరం ఉండగానే జ్ఞానులు అయిపోతారు.**

ఇంట్లో ఉంటున్నారా లేకపోతే పది అంతస్తులు మేడలో ఉంటున్నారా భగవంతుడికి అక్కర్లేదు. మీరు ఆ ఇంట్లో ఎలా జీవిస్తున్నారో కావాలి. కొంతమంది తాటాకు ఇంట్లో కూడా ఎంతో పవిత్రంగా జీవిస్తారు. కొంతమంది పది అంతస్తులు మేడ కట్టుకుని ఆ పైన సారాలు తాగుతూ, పేకాటలు ఆడుకుంటూ కూర్చుంటారు. ఆ దారి వెంట వెళ్ళేవారు అబ్బా ఎంత గొప్ప మేడ కట్టేశారు అనుకుంటారు లోపలకి వెళ్ళి చూడాలి తెలుస్తుంది.

స్థూల దృష్టి ఉన్నవాడు ఎంతసేపు బయట చూపే చూస్తాడు కానీ లోపల చూపు చూడడు. నీ బుద్ధి సూక్ష్మం చెందితే లోపల మనస్సు ఎలా పని చేస్తోందో తెలుస్తూ ఉంటుంది. మీరు ఏ ఇంటిలో ఉంటున్నారు అని కాదు మీరు ఎలా జీవిస్తున్నారో, మీ హృదయం ఎంత ప్రశాంతంగా ఉన్నది అనేది ముఖ్యం. మీకు ఎన్ని ఉన్నప్పటికీ హృదయంలో శాంతి లేకపోతే మీరు జీవించలేరు. అది కాదండి మీరు ఎంతో సంపాదించారు ప్రాణం పోగొట్టుకుంటే ఏమిటి ప్రయోజనం! అదే విధంగా ఈ ప్రపంచాన్ని అంతటినీ నేను పోగేసుకున్నాను. కానీ ఆత్మను నేను తెలుసుకోలేదు ప్రయోజనం ఏమిటి? ఈ శరీరంలోకి వచ్చాక, ఈ ప్రపంచంలోకి వచ్చాక ఆత్మని తెలుసుకోకుండా, నిజాన్ని తెలుసుకోకుండా సత్యాన్ని తెలుసుకోకుండా నీ శరీరాన్ని విడిచి పెడితే నువ్వు అనుభవించే నష్టం ఇంతా అంతా కాదు. ఈ శరీరం వచ్చినందుకు నువ్వు సత్యాన్ని తెలుసుకోవాల్సిందే సత్యాన్ని తెలుసుకోకుండా కనుక నీ శరీరం పడిపోయిందా నువ్వు పొందేది ఏది లేదు. నేను బజారుకి వెళ్లాను. నాకు మామిడి పళ్ళు తినాలని ఉంది, మామిడిపళ్ళు తెచ్చుకున్నాను ఇక్కడ పెట్టుకున్నాను ఈలోపు నా ప్రాణం పోయింది. ఆ మామిడి పళ్ళ వల్ల నాకు ప్రయోజనం ఏమిటి?

అద్రోహం ద్రోహం లేకుండా ఉండడం. ద్రోహం లేకుండా ఉండడం అంటే ఏమిటండి, మనకి ఎవడైనా అపకారం చేస్తే తిరిగి వాడికి అపకారం చెయ్యాలి అని ఉంటుంది. ఎవడైనా మనల్ని తిడితే వాడిని తిట్టాలి అని ఉంటుంది. ఎవడైనా మనల్ని కొడితే వాడిని కొట్టాలి అని ఉంటుంది. అందుచేత మీకు ఎవడైనా అపకారం చేసినప్పటికీ వాడి మీద ద్రోహబుద్ధి పెట్టుకోనక్కరలేదు. మళ్ళీ వాడిని పాడు చెయ్యాలనే బుద్ధి మీరు పెట్టుకోనక్కరలేదు. మన బుద్ధి ఎలా ఉంటుందో పరమాత్మకు తెలుసు. మన బుద్ధి ఎలా ఉంటుందో తెలిసి ఆ బుద్ధిలో ఉన్న వంకరలు తీసెయ్యటం కోసం ఈ మాటలు చెబుతున్నాడు.

నాతిమానితా అంటే గర్వం లేకుండా ఉండడం. మనిషికి తెలివి ఎంత తక్కువ ఉంటే గర్వం అంత ఎక్కువ ఉంటుంది. నన్ను అందరూ పూజించాలి, నన్ను అందరూ గౌరవించాలి అనే భావన గర్వం ఉన్నవాడికే వస్తాయి. నన్ను అందరూ గౌరవించాలి, నన్ను అందరూ పెద్దగా పొగడాలి అనే అధికారం ఏమీ పెట్టుకోవద్దు. మాములుగా సామాన్య మానవుడిగా ఉండండి. తోటి వాడికంటే గొప్పవాడిని అని ఏమి అనుకోవద్దు. లోపల తెలివి ఉంటే పెంచుకో, జ్ఞానం ఉంటే పెంచుకో కానీ పక్కవాడి కంటే గొప్పవాడిని నన్ను అందరూ గౌరవించాలి. నాకు అందరూ ఆధిక్యత ఇవ్వాలి అనేటటువంటి గొడవలు నువ్వు ఏమీ పెట్టుకోవద్దు. ఎందుచేత అంటే దానివల్ల నీకు గర్వం పుడుతుంది. మనిషికి గర్వం ఉందంటే వాడికి జ్ఞానం లేనట్టే కొండ గుర్తు.

భవన్తిసంపదందైవీమభిజాతస్యభారత, ఈ మాటలు ఎంత పొందికగా స్వీట్‌గా ఉన్నాయి. ఎంత పొందికగా వాడుతున్నాడో చూడండి భగవంతుడు. జాతస్య జాతస్య అంటే పుట్టడం. అభిజాతస్య అంటే నువ్వు పుట్టావు ఎలా పుట్టావు? దైవీ గుణాలకి అర్హత కలిగి పుట్టావు. భగవంతుడు ఎలా చెబుతున్నాడో చూడండి నేను చెప్పాను కాబట్టి నీకు మంచి గుణాలు ఉన్నాయి కాబట్టి నువ్వు బాగు పడతావు. ఒకవేళ మంచి గుణాలు లేకపోతే నేను చెప్పినా నువ్వు బాగు పడవు. దైవీసంపదతోటి నువ్వు పుట్టావు కాబట్టి ఓ భారత, ఓ అర్జునా నువ్వు ఇంకా తెలుసుకో బాగుపడతావు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# దీపోత్సవం

అరుణాచలం దీపోత్సవాన్ని ది॥ 19-11-2021న జరుపుకోబోతున్నాం! ఈ కార్తీక దీపోత్సవం, అరుణాచల క్షేత్రంలో అనాదిగా జరుగుతూ వస్తున్న, ప్రసిద్ధమైన పండుగ. కార్తీకమాసం, కృత్తికానక్షత్రం పూర్ణిమ రోజున, సకల జీవుల హృదయాలలో అంతర్యామిగా ఉన్న పరంజ్యోతికి చిహ్నంగా, అరుణగిరి శిఖరం మీద దీపం వెలిగిస్తారు! ఒకానొక సమయంలో, త్రిమూర్తులలో ఇద్దరైన బ్రహ్మ, విష్ణువులకు నేను-గొప్ప అంటే, నేను-గొప్ప అనే తగాదా వచ్చింది! దానికి కారణం బ్రహ్మగారు సృష్టికర్త మరియు జ్ఞానదేవత అయిన సరస్వతీపతి. అదేవిధంగా విష్ణువు స్థితికర్త మరియు ఐశ్వర్యమునకు దేవత అయిన లక్ష్మీపతి. అప్పుడు వారు ఇరువురు, తమ తగవును తీర్చడానికి సదాశివుని ప్రార్థించగా, శివుడు వారికి జ్యోతిరూపముగా దర్శనమిచ్చాడు. ఆరోజుకు గుర్తుగా, ప్రతీ సంవత్సరం కార్తీకమాసం కృత్తికానక్షత్రం రోజున సాయంత్రం 6 గంటలకు, అరుణగిరిపై జ్యోతిని వెలిగిస్తారు. అటు పిమ్మట వారి ఇరువురి ప్రార్థన మేరకు, ఆ జ్యోతి స్వరూపం అరుణగిరి రూపుదాల్చి, ఆ తరువాత కాలంలో ఆదిలింగముగా, అరుణాచలేశ్వర లింగముగా ఉద్భవించింది. ఆ ప్రకాశమే తరువాత కాలంలో అనగా 1879లో తిరుచ్చుళి గ్రామంలో అలగమ్మ, సుందరం అయ్యరుల వరపుత్రుడైన వేంకటరామన్‌గా రూపుదాల్చింది. సదాశివుడు బ్రహ్మ-విష్ణువుల కలహమును తీర్చి అనుగ్రహించాడు, ఆ 'అనుగ్రహమే' అరుణగిరి రూపుదాల్చి, దేవతలకు, మానవులకు ఆరాధ్యమైంది. అదే అరుణాచలం! ప్రతీ క్షేత్రానికి ఒక మహిమ ఉంటుంది, అరుణాచలమునకు అహంకారం నిర్మూలించే కొండగా పేరు. భగవాన్ శ్రీరమణుని అతి చిన్న వయస్సులోనే అరుణగిరి తనవైపుకు ఆకర్షించుకొని, తన వాడిని చేసుకుంది. "అరుణగిరి మాంసనేత్రాలకే శిలాకారం, అసలు జ్యోతి స్వరూపమే" అన్నారు భగవాన్. మన మాంసనేత్రాలకు శిలాకారంగా కనిపించే కొండ, రమణునికి గురువు మరియు చిదానందబ్రహ్మము. అట్టి పవిత్ర అరుణాచల క్షేత్రముతో, సద్గురువు శ్రీనాన్నగారికి గల అనుబంధం మాటలతో చెప్పలేము. శ్రీనాన్నగారి సమక్షంలో అనేక దీపోత్సవాలలో పాలుపంచుకునే అవకాశం మనకు కలిగింది. అది ఎన్నో జన్మల పుణ్యఫలమే.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

## పుట్టు గుడ్డివాడు దేన్నీ చూడలేడు - గురువు లేని వాడు జ్ఞానాన్ని పొందలేడు

సద్గురుని ఆశ్రమము దొరకని వాడు, ఆ కృపా భాగ్యము పొందనివాడు ఎన్ని సాధనలు చేసినా, గుడ్డివానిలా దారి తెలియక గోతిలో పడుచు లేచి మరలా మరో గోతిలో పడుచూ జీవితం అంతా అలాగే సాగును. గురువులేని జన్మములు వ్యర్థములు. అది అంతా దుఃఖమయమైన జీవితాలే వానికి సంసార బాధ ఎన్నటికీ తీరదు. కష్టకాలంలో, మానసిక అశాంతిగా ఉన్నప్పుడు గురునామాన్ని జపించటం ద్వారా శాంతిని పొందవచ్చు. సద్గురుని సన్నిధిలో సహనం, సంతోషం, దయ, వినయం మొదలైన సద్గుణాలు పెంపొందుతూ ఉంటాయి. అంధ విశ్వాసి, నీచుడు, దైవ విరోధి, నిత్య శంకితుడు వెంట ఉండువారు గురువు యొక్క ఉనికి గురించి, ఆయన స్వరూపం గురించిగానీ తెలుసుకోలేరు. దేవుడు (సత్యం) ఎలా పొందుతాడు. గురువు ద్వారా గురువును పూర్ణంగా ప్రేమించువానికి ఇతరము ఏమీ తెలియదు. అతను అందరినీ సమానంగా చూస్తాడు, దయకలిగి ఉంటాడు. తృష్ణ అతనిని అలరించదు. ఆత్మ సంతృప్తి ఆతనిలో తొణికిసలాడుతుంది. ఆత్మ నిష్ట నుంచి పారిపోడు, ఆత్మలోనే నిలిచి ఉండటం ఆనందంగా ఉంటాడు. పుట్టు గుడ్డివాడు సూర్యుడిని చూడనట్లే పాపకర్మలు గలవారు గురు మహిమను గ్రహించలేరు. గురువులు అంటారు "ఈసారి మిమ్ములను యుద్ధంలో (సాధన పేరుతో మీరు చేసే యుద్ధంలో) శ్రమ పడనియ్యరు. వెనుక ఉండి సూక్ష్మ జగత్తులో కల ద్వారాగానీ, మరోరకంగాగానీ వాటిని తొలగించేస్తాము. మీరు అంత శ్రమపడనక్కరలేదు" అంటారు. శ్రీనాన్నగారు "కాసేపు ముక్కు గాలి చూసుకోవటాలు, ధ్యానాలతో కాలక్షేపం చెయ్యండి, ఊరికే చేతులు ఆడించండి, తగిన సమయం చూసుకొని మీ గురువు మీ మనస్సును ఒక తన్ను తన్ని ఆత్మ గూటిలో పడేస్తాడు. అప్పడు మీరు నిజస్థితిలో ఉంటారు. అప్పడు సాధనలు లేవు అంతా సాధ్యమే" అంటారు. దాని అర్థం అర్జునునితో శ్రీకృష్ణుడు "యుద్ధం పేరుతో చేతులు ఊపు అంతా నేనే చేస్తాను, చచ్చిన వాళ్ళ మీద బాణాలు వెయ్యి" అంటాడు. సాధకుల పాలిట గురువు అలాగే చేస్తాడు. పైన చెప్పిన అంశాలు ఆచరణలో రావాలంటే గురు కృప ఉంటేనే సాధ్యం. శిష్యుడు సాధన దిగ్విజయంగా నిర్వహించే శక్తిని గురుదేవుడే నాకు అనుగ్రహించాలని ఆయనను నిరంతరం ప్రార్థించాలి. గురువు ఆపదల్లో, కష్టాలలో ఉన్నప్పుడు నిజంగా మనలను ఆదుకొనేవాడు ఆయన ఒక్కడే. దాన్ని హృదయపూర్వకంగా గ్రహించితే మన మనశ్శాంతికి భంగం కలుగదు అని నిరంతరం తలచుకోవాలి. గురువే శక్తిమంతుడు, శాశ్వతుడు. నన్ను ఏ శక్తి ఏమీ చెయ్యలేదు, ఏ భయాలు, కొరతలు లేవు దానితో అవి నిష్క్రమించటం జరుగుతుంది. తాపత్రయాల భారంతో కృంగిపోయేవాడు సంసార సముద్రంలో మునిగిపోతాడు. గురువు పాదాలను ఆశ్రయిస్తే అంతా మేలే. అతి సున్నిత మనస్కులే గురువును గుర్తిస్తారు. మనం తరించాలని అనుకొంటే ఆచరణ రూపం ధరించాలంటే గురువు యొక్క అనుగ్రహం ఎంతైనా అవసరం. కబీర్ "సద్గురువు సాన్నిధ్యంలో ఒక్క క్షణం కాలం ఉంటే లక్షలాది పాపాలు పోతాయి" అంటారు. గురువు అంటే సాధకునికి ఏ మాత్రం తెలియని దారులను చూపించే వాడని అర్థం. గురు వైభవం అది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**